నీలి నీడలు

వి.యస్. రావ్

డిటెక్టివ్ టెంపో చదువుతున్న స్కాట్‌లాండ్ యార్డు క్రైమ్ రిపోర్టుని పక్కనే సోఫామీద పడేసి, ఆవులిస్తూ వాచీ చూసుకున్నాడు. పదకొండు దాటింది. సోఫాలోంచీ లేచి చేతులు పైకెత్తుతూ అలసటగా వొళ్ళు విరుచుకున్నాడు.

టెంపో కోటును తీసి సోఫామీదికి వదిలాడు. అతని కుడి చెయ్యి నెక్‌టైని ఊడదీసే ప్రయత్నం చేయసాగింది. ఛైయిమ్స్ రాగయుక్తంగా ధ్వనించాయి. అర్థరాత్రి అతిథి యెవరా అనుకుంటూ హాల్లోకి నడిచాడతను. బోల్టు లాగి, తలుపు తెరిచాడు. గుమ్మంలో నిలబడ్డ వ్యక్తిని ఆశ్చర్యంతో చూశాడు. ఖరీదైన సెంటు మత్తెక్కిస్తూ అతనివైపు దూసుకొస్తోంది.

టెంపో ఏదో అడగబోయాడు. ఆమె అతన్ని దాదాపు తోసుకుంటూ లోపలకు దూరింది. ఆశ్చర్యంతో టెంపో ఆమెవైపు తిరిగాడు.

"మిస్టర్ టెంపో, తలుపు మూసెయ్యండి!" ఏదో చెట్టుమీంచీ కోయిల తన గదిలోకి ఎగురుతూ వచ్చి, వాలి కూసినట్టనిపించిందతనికి. అప్రయత్నంగా అతని చెయ్యి తలుపుని మూసింది.

"గొళ్ళెం పెట్టేయండి!"

టెంపో ఆమెవైపే చూస్తున్నాడు. అతని ఎడమ చెయ్యి ఆమె చెప్పినట్టుగా గొళ్ళెం పెట్టేసింది. లేత గులాబిరంగు ఆర్గండీ చీర. అదే రంగు స్లీవ్ లెస్ జాకెట్. భుజాల్ని తాకుతూ అలల్లాగా కిందికి సాగిన బాబ్డు హెయిర్. బోర్లించిన అరచేతుల్లా వున్న కనుబొమల కింద దీపాల్లా వెలుగుతున్న పెద్ద పెద్ద కళ్ళు. చెవులకి డైమండ్ రింగ్స్. తలమీద ముసుగులా వున్న పైటని ఆమె కిందికి లాగింది.

"మిస్టర్ టెంపో, క్షమించండి. ఏదీ కాని వేళ ఇలా జొరబడ్డాను!" అందామె. "నన్ను పరిచయం చేసుకోవాల్సిన అవసరం లేదనుకుంటా!" ఆమె నవ్వింది. చాక చక్యంగా, చక్కగా రికార్డుచేసిన సెలయేటి గలగల క్యాసెట్ ఆమె కంఠంలో మోగినట్టనిపించింది. ఆమె కళ్ళు నవ్వుతున్నాయి.

డిటెక్టివ్ టెంపో నవ్వాడు. "నీ ఫోటోలేని ఫిలిం మ్యాగజైన్, కథల మాసపత్రిక, సచిత్ర వారపత్రిక ఏదో వొకటి సంపాదించడానికి ఎంతో ప్రయత్నించి, ఓడిపోయాను!"

ఆమె, శశిప్రియ హాయిగా నవ్వింది. చిగురుటాకుల చాటునుంచీ తొంగిచూసే మొగ్గల్లా, ఎర్రటి పెదవుల సందులోంచీ తెల్లటి పళ్ళు తళుక్కుమన్నాయి. "ఏక వచనంలో సంబోధించినందుకు థాంక్స్! నా ఫోటో

అంటే మీకు అయిష్టమా?" ప్రశ్నిస్తూ నవ్వింది ఆమె.

టెంపో చిన్నగా నవ్వాడు. "యూ ఆర్ మిస్టేకన్. నీ ఫోటో ప్రచురించబడని పత్రిక ఆంధ్రదేశంలో లేదు అని నా అర్థం! అచిరకాలంలో నువ్వు టాప్ స్టార్ అయి పోయావు! తారాపథంలోకి దూసుకెళ్ళిపోయావు."

"తారాపథంలోకి దూసుకెళ్ళిన వ్యక్తి మళ్ళీ నేల మీదికి, ధూళిలోకి కూలిపోయే ప్రమాదం కూడా వుంటుంది మిష్టర్ టెంపో!" శశిప్రియ నవ్వుతూ అంది. ఆమె నవ్వులో ఏదో ధ్వనించింది. టెంపో కళ్ళు చిట్లించాడు.

"టాప్ హీరోయిన్ ఇలా అర్ధరాత్రి...." అంటూ ఆగాడతను.

"మిష్టర్ టెంపో, ఎంతో కష్టపడి, మారువేషం వేసుకున్నంత పని చేసి, చుట్టూ ముసురుకున్న వందిమాగధులనుంచీ, జలగలనుంచీ ఎలాగో తప్పించుకుని, చాలా రహస్యంగా ఇక్కడికొచ్చాను. మళ్ళీ త్వరగా నేను నా బంగారు పంజరంలోకి చేరిపోవాలి!" అప్రయత్నంగా ఆమె కుడిచెయ్యి బంగారు కమ్మీలో గుచ్చిన డిస్కో నల్లపూసల్ని తడివింది.

"ఆ గదిలో కూచుందాం...." టెంపో కదిలాడు. ఆమె అనుసరించింది.

టెంపో ఆమెకి సోఫా చూపించాడు. ఖరీదైన వానిటీ బాగ్ ని వొళ్ళో పెట్టుకుని, సోఫాలో కూచుని, కాలు మీద కాలు వేసుకుంటూ శశిప్రియ తెల్లటి పళ్ళు చూపిస్తూ నవ్వింది. ఆ క్షణంలో తన చేతిలో కెమెరా లేనందుకు టెంపో విచారించాడు.

"కాఫీ, టీ, కూల్ డ్రింక్?" టెంపో ప్రశ్నించాడు.

"ఏదో వొకటివ్వండి....ఐ వాంట్ సమ్ థింగ్

హాట్ ..." శశిప్రియ తడబడింది.

టేబుల్ మీద ఫ్లాస్కులో వున్న టీని రెండు కప్పుల్లో పోసి, ఆమెకి ఒక కప్పు అందించాడు టెంపో. ఏకాగ్రతతో టీ చప్పరించసాగింది శశిప్రియ. కప్పు అంచుల మీదుగా ఆమె చేపల్లాంటి కళ్ళు టెంపోనే చూస్తున్నాయి. "థాంక్స్. టీ టీలాగే వుంది!" కప్పుని టిపాయ్ మీద పెడ్తూ అంది శశిప్రియ.

టెంపో ఆశ్చర్యంగా ప్రశ్నార్థకంగా చూశాడు. ఆమె చిరునవ్వు నవ్వింది. "ఇంటా, బయటా నాకు స్పెషల్ టీ సమర్పించబడుతుంది. అదెప్పుడూ, ఇలా ఒరిజినల్ టీలా వుండదు!"

టెంపో నవ్వుతూ సిగరెట్ వెలిగించాడు. శశిప్రియ అప్రయత్నంగా ముక్కు చిట్లించింది. "సిగరెట్ వాసన నాకు నచ్చదు...."

"అయామ్ సారీ. ఐ కాంట్ హెల్ప్ ఇట్. నాకు నచ్చని వాసనని నేను ఇందాకట్నుంచీ సహిస్తున్నాను."

"మిష్టర్ టెంపో...."

"నాకు సెంట్లు నచ్చవు. మనిషి అసలు వాసనని కప్పెట్టేస్తాయవి. మనిషి అసలు వాసననిబట్టి వ్యక్తిత్వాన్ని అంచనా వేయడం నాకు ఇష్టం!" టెంపో నవ్వుతూ వివరించాడు. శశిప్రియ తేలిగ్గా నవ్వింది. టెంపో వదిలిన స్మోక్ రింగ్ ఆమెవైపు గమ్మత్తుగా కదుల్తోంది. మెల్లిగా దాన్ని దూరంగా ఊదేసి, శశిప్రియ నవ్వింది.

మిస్టర్ టెంపో, మీరు దాపరికం లేకుండా మాట్లాడుతున్నారు. సినీతారను చూస్తే మామూలుగా మగాడిలో అవుపించే ఆత్రుతా, ఆకలీ, ఇన్ఫీరియారిటీ

మీ కళ్ళల్లో మచ్చుకైనా లేవు...."

"థాంక్స్. సినీతారలుకూడా రెండుకాళ్ళ మనుషులనే నా ఉద్దేశం! ఇంతకీ...."

"మిస్టర్ టెంపో.... నాకు.....నాకు రారాని కష్టం వచ్చింది...." శశిప్రియ ఆగి అదోలా చూసింది.

టెంపో ఆమెని ప్రశ్నార్థకంగా చూశాడు. ఏదో సందేహం ఆమె కళ్ళల్లో లీలగా ప్రత్యక్షమైంది.

"వినడానికి తయారుగా వున్నా!" టెంపో నవ్వుతూ అన్నాడు, నిద్రను వైలెట్‌గా తోసుకొస్తున్న ఆవులింతని బలవంతంగా మింగుతూ.

"మొదట చూడండి. తరవాత విందురుగానీ," అంటూ శశిప్రియ వానిటీ బాగ్‌లోంచీ ఒక వీడియో క్యాసెట్‌ని ఇవతలికి తీసింది. టెంపో ప్రశ్నార్థకంగా చూశాడు. శశిప్రియ అతనివేపు చూడ్డంలేదు. ఆమె మెల్లగా లేచింది. గోడవారగా వున్న వీడియోక్యాసెట్ ప్లేయర్ వైపు వెళ్ళింది. టెంపో ఆమె వీపునే చూస్తూ మౌనంగా కూచున్నాడు. కాసెట్‌ని విసిపిలో పెట్టి బటన్ నొక్కి శశిప్రియ వెనక్కి తిరిగింది. ఆమె మొహంలో చిరునవ్వు లేదు. మెల్లగా సోఫావైపు నడిచింది. ఆమె అడ్డుతొలిగాక టీవీ స్క్రీన్ టెంపో దృష్టిని ఆకర్షించింది.

టెంపో కళ్ళు చెదిరినట్టయ్యాయి. కలర్ టీవీస్క్రీన్ మీద అతని దృష్టి తాపడం అయిపోయింది. బాత్‌రూమ్ తలుపు మూసిన స్త్రీ ఆకారం వెనక్కి, టెంపోవైపు తిరిగింది. సముద్రంలోంచీ అప్పుడే పైకివచ్చిన జలకన్యలా వుందామె. ఆమె శరీరంమీద నీటిముత్యాలు తప్ప మరే ఆచ్ఛాదనా లేదు. ఎత్తైన గుండ్రటి రెండు పుట్టలమధ్య

సన్నటి పాములా నీళ్ళు ఆమె స్తనాలమధ్య జారుతున్నాయి. రెండు చేతుల్నీ పైకెత్తి బాబ్డ్ హెయిర్ని కదుపుతూ, కెమెరాలోకి నవ్వుతూ చీకూ చింతా లేకుండా కదుల్తోందామె.

మెల్లగా, కెమెరా డబుల్ బెడ్ మీదికి తిరిగింది. మంచానికి ఆనుకుని అతను నిలబడ్డాడు. అతనూ కూడా ఆమెలాగే అప్పుడే పుట్టిన బిడ్డలా వున్నాడు, కాకపోతే ఆమెలాగే వయసొచ్చిన తరువాత పుట్టిన వాడిలా వున్నాడు. ఇద్దరి మొహాల్లో నవ్వు. ఆ నవ్వులో కోరిక నవ్వుతోంది. అతను చిలిపిగా చూస్తూ రెండు చేతులూ చాచాడు. అతని చేతులలోకి ఉద్రేకంతో జారిందామె; ఆమె....శశిప్రియ ...

బాగా, ఎర్రగా కాలిన లోహం ముక్కలు ఒకదానికొకటి అతుక్కుపోయినట్టు ఆమే, అతనూ ... టెంపో లేచాడు. చకచకా టీవీ వైపు నడిచాడు. కలల్లో జరుగుతున్న తరవాత నాటకాన్ని చూడాల్సిన అవసరం లేదు. టెంపో చెయ్యి కదిలింది. నాటకం ముగిస్తూ తెరని లాగేసింది. టెంపో వెనక్కి తిరిగాడు.

శశిప్రియ వైపు చూశాడు. ఆమె అతన్ని చూడ్డంలేదు. రెండు చేతుల్తో కణతల్ని నొక్కుకుంటూ తలవాల్చి కూచుందామె. ఆరిపోయిన సిగరెట్‌ని కిందపడేసి, టెంపో మరో సిగరెట్ వెలిగించాడు. మెల్లగా నడిచి, శశిప్రియ ముందు ఆగి, ఆమెవేపు, కిందికి చూశాడు.

"ప్రేక్షకుణ్ని ఎన్నుకోడంలో నువ్వు పొరపాటు చేశావ్!"

శశిప్రియ ఉలిక్కిపడి తలెత్తింది. ఆమె కళ్ళు బలహీనంగా, దీనంగా చూస్తున్నాయి. తెల్ల మొహం వేసు

కన్న టీవీని వొకసారి చూసి, తన చూపుల్ని టెంపో వైపు ఎత్తిందామె.

"టెంపోగారూ, చూశారా?" ఆమె కంఠం వణికింది.

"ఒక మెతుకుపట్టి చూశాను; చాలు. అన్నం అంతా చూడక్కర్లేదు! పైగా, ముందే చెప్పాను; నువ్వు ప్రేక్షకుడి సెలక్షన్‌లో...."

"లోకంలోని ప్రేక్షకులు దాన్ని చూడకూడదనే ఉద్దేశంతో ఈ ప్రేక్షకుణ్ని ఎన్నుకున్నాను, మిస్టర్ టెంపో.'

డిటెక్టివ్ టెంపో ప్రశ్నార్థకంగా చూస్తూ ఆమె యెదురుగా కూచున్నాడు. యెక్కడికో యెగిరిపోయిన నిద్ర గురించి ఆలోచిస్తూ. వెనక్కి వాలాడు.

"చూడ్డం అయింది. ఇంక విందామా?" అన్నాడు నవ్వుతూ

శశిప్రియ నిట్టూర్చింది "మిస్టర్ టెంపో, మళ్ళీ ఎప్పుడు మీలా తేలిగ్గా, హాయిగా నవ్వగలనా అనిపిస్తోంది నాకు....ఏడాది క్రితం నాకు పెళ్ళయింది. తెలుసుగా?"

"సినిమా పత్రికలూ, గాసిప్ కాలమ్సూ నేను చదవను."

"పెళ్ళి గాసిప్ కాదు!" శశిప్రియ అడ్డుతగిలింది.

"నెవర్ మైండ్! ఇప్పుడు తెలిసిందిగా? నీకు ఏడాది క్రితం పెళ్ళయింది....ప్రొసీడ్!" టెంపో నవ్వుతూ సీన్నాడు.

"నా పెళ్ళి చాలా డ్రమెటిగ్గా జరిగింది. 'చీకట్లో నీడలు' అన్న అట్టర్ ఫ్లాప్ ఆర్ట్ ఫిలింతీసిన డైరెక్టర్

గంగాధర్‌తో నా పరిచయం అచిరకాలంలో ప్రణయంగా ఎదిగింది. 'చీకట్లో నీడలు' బాక్సాఫీస్ దగ్గర పల్టీ కొట్టినా, నిర్మాత దాదాపుగా చిత్రసన్యాసం తీసుకున్నా, గంగాధర్‌కి డైరెక్టర్‌గా గొప్ప పేరొచ్చింది. గంగాధర్ టాలెంటూ, కమిట్‌మెంటూ, కళాతృష్ణా, సామాజిక దృక్పథం నన్ను అతనికి దగ్గరగా చేశాయి. నేను యాక్టుచేస్తున్న ఒక చిత్రం పెళ్ళి సీనులో, అదే సెట్టింగులో, హఠాత్తుగా మా పెళ్ళి జరిగిపోయింది. సినిమాటిగ్గా జరిగిన మా పెళ్ళి పెద్ద సంచలనం సృష్టించింది."

"శశిప్రియా, ఉపోద్ఘాతం ఆంజనేయుడి ఎలాస్టిక్ తోకలా పెరుగుతోంది!" టెంపో నవ్వుతూ అడ్డు తగిలాడు.

శశిప్రియ బలవంతంగా నవ్వింది. "శ్రీ లేకపోతే శుభంలేదు. అసలు పాయింటులోకి అడుగుపెడ్తున్నా. పెళ్ళయిన అర్నెల్లదాకా హనీమూన్ వెళ్ళలేకపోయాం: నా చిత్రం పూర్తికాని కారణంగా. వేరే కాల్‌షీట్స్ కేన్సిల్ చేసుకుని, హనీమూన్ వెళ్ళాం. ఫారిన్ కంట్రీస్ లండన్, న్యూయార్క్, వెనిస్...చివరికి పారిస్..." శశిప్రియ ఆగింది.

సిగరెట్ పీకని యాష్‌ట్రేలో నొక్కి టెంపో ఆమెవైపు కానిమ్మన్నట్టు చూశాడు.

"మేం వెళ్ళిన ప్రతిచోటికీ స్వర్గం దిగొచ్చింది. గతాన్నీ, భవిష్యత్తునీ మరిచిపోయి, అందర్నీ, అన్నింటినీ మరిచిపోయి ఇద్దరమే....ఇద్దరూ ఒక్కరుగా ఆనందానికీ, తృప్తికీ ప్రతిరూపాలుగా గడిపాం. పారిస్‌లో.. పారిస్‌లో అగ్నిపర్వతం బద్దలైంది. మా స్వర్గాన్ని ఆ

లావా దారుణంగా ముంచేసింది..” శశిప్రియ కంఠం క్రమక్రమంగా తగ్గుతూ, గుసగుసగా మారిపోయింది.

2

పారిస్.

హోటల్ డి పారిస్. బ్రైడల్ సూట్.

కిలకిల నవ్వుతూ శశిప్రియ గదిలో ప్రవేశించింది. ఆమె వెనకనే గదిలోకి మారి తలుపు మూసి గంగాధర్ తటాలున ఆమె పైట పట్టుకున్నాడు. శశిప్రియ గిరుక్కున తిరిగి వీపుచుట్టూ పైటని చుట్టుకుంటూ అతని దగ్గరగా జరిగింది. ప్రేమగా, అలసటగా అతన్ని ఆనుకుని, వెడల్పాటి ఛాతీమీద తల వాల్చింది. గంగాధర్ చేతులు ఆమె మొహాన్ని ఇరువైపులా పట్టుకుని పైకెత్తాయి. చుట్టూ మసిబారిన ప్రమిదల్లో వెలుగుతున్న జ్యోతుల్లా మెరుస్తున్న శశిప్రియ కాటుక కళ్ళు అతని కళ్ళల్లో చూశాయి. ఎర్రటి పెదవులు చిరుగాలికి కదిలే చిగురాకుల్లా అల్లల్లాడాయి ఆమె కళ్ళల్లోని కోరికని పెదవులు ధ్వనిలేని భాషలో వ్యక్తం చేస్తున్నాయి. అప్రయత్నంగా ఆమె శరీరం చెట్టుబోదెని హత్తుకునే తీగలా అతని పొడుగాటి శరీరాన్ని హత్తుకుంది. మెల్లిగా నిట్టూర్చిందామె.

చెంపల్ని నొక్కుతున్న అతని చేతుల్ని సున్నితంగా తొలగిస్తూ శశిప్రియ దూరంగా జరిగి, బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది. గంగాధర్ చిరునవ్వుతో ఆమె వెళ్ళినవైపే చూస్తున్నాడు. కాసేపట్లో బాత్‌రూమ్‌లోంచీ ఆమె ఇవతలికి వచ్చింది. ఉలిపిరికాగితంలాంటి మాక్సీ ఆమె సౌందర్యాన్ని ఎత్తిచూపుతోంది. ఇంకా ఫుల్ సూట్‌లోనే వున్న భర్తని ఆక్షేపంగా చూసిందామె.

నవ్వుతూ దగ్గరగా జరిగి, కోటు గుండీలు విప్పే ప్రయత్నం చేసింది. గంగాధర్ కాడల్లాంటి ఆమె వేళ్ళని పట్టుకున్నాడు. పైకెత్తి ఎర్రటి అరచేతుల్ని ముద్దెట్టుకున్నాడు.

"ప్రియా, మాక్సీతో నా కళ్ళని కప్పేస్తున్నావెందుకు?" అన్నాడు నవ్వుతూ.

శశిప్రియ సిగ్గుపడుతూ నవ్వింది. "ఆకుల చాటున వుంటేనే పువ్వుకి అందం!"

"నో. నువ్వు నువ్వుగా కనిపించాలి నాకు! నీ దుస్తుల్ని కాకుండా నిన్ను ప్రేమిస్తున్నాన్నేను!" గంగాధర్ కంఠంలో ప్రేమ ఆవేశంగా ధ్వనించింది. అతని కళ్ళు ఆరాధనగా మారిపోయి ఆమెని చూస్తున్నాయి.

"నాకు .సిగ్గు.." శశిప్రియ మెల్లిగా అంది. మళ్ళీ ఆమె చేతులు అతని కోటు గుండీల్ని పట్టుకున్నాయి. మళ్ళీ అతని చేతులు ఆమె చేతుల్ని పట్టుకుని ఆపాయి.

"కమాన్ .... బాక్స్ రిజర్వ్ చేయించాను. మూవీకెళ్దాం" అన్నాడతను.

"వొద్దు. సైట్ సీయింగ్ తో అలిసిపోయాను. రోజంతా జనం మధ్యలోనే గడిచిపోయింది. ఇంక మళ్ళీ లోకంలోకి రాను. మీ దగ్గరగా.."

"గంటన్నరేగా? కమాన్!" అంటూ గంగాధర్ ఆమె నొదిలేసి వార్డ్ రోబ్ వైపు కదిలాడు. ముదురు పసుప్పచ్చరంగు కంజీవరం పట్టుచీర తీసి మంచంమీద పడేశాడు. "కట్టుకో కట్టుకో పట్టుచీర!" రాగయుక్తంగా పాడుతూ నవ్వాడు.

శశిప్రియ బుంగమూతి పెట్టింది.

"హోటల్ కి దగ్గరే. ఓడియన్ థియేటర్. కొత్త దంపతులు చూసితీరాల్సిన కళాఖండం ఆడుతోందని

ప్రొప్రయిటర్ జార్జ్ అడక్కుండానే టికెట్స్ తెప్పించేశాడు. "వండర్ ఫుల్ స్టిములెంట్ ఫర్ న్యూలీవెడ్స్!" అన్నాడతను. వెళ్ళకపోతే మన కల్చర్ని సందేహిస్తాడు. పారిస్ దృష్టిలో ఇండియన్ కల్చర్ని మనం అవమానించకూడదు. పైగా మనిద్దరం షోబిజినెస్ వాళ్ళమని అతనికి తెలుసు!"

శశిప్రియ అతన్ని అలసటగా చూసింది. "తెలుగు సినిమాలో అతిచిన్న డైలాగ్ సైజులో మాట్లాడేస్తున్నారు! ఆల్ రైట్. ఓడిపోయాను. కళ్ళు మూసుకోండి. కంజీవరంలో ప్రత్యక్షమవుతాను!" అంది నవ్వుతూ...

కమర్షియల్స్ పూర్తయ్యాక అసలు సినిమా ప్రారంభమైంది. టైటిల్స్ లేవు. చివర్న వేస్తారా? ఆలోచిస్తూ చూస్తున్న శశిప్రియ ఉలిక్కిపడింది. ముంజేతిని గిల్లుకుని, రెప్పలు రెపరెపలాడించి, మళ్ళీ చూసింది. ఆమె గుండె ఆగినంత పనయింది.

వెడల్పాటి స్క్రీన్ మధ్యలో ఆ యువతి నూలుపోగు లేకుండా ప్రత్యక్షమైంది. నీటిముత్యాలు ఆమె శరీరంమీద పూసల్లా మెరుస్తున్నాయి. బాత్ రూమ్‌లోని మిరర్‌లో తనని చూస్తున్నట్టు అనుభూతి కలుగుతోంది ఆమెలో. కలా? నిజమా?

లోపల్నుంచీ తన్నుకొస్తున్న కేకని బలవంతంగా గొంతుకలోంచీ అణగదొక్కి, పక్కనే కూచున్న భర్త వేపు ఆందోళనతో చూసిందామె. గంగాధర్ మంత్రముగ్ధుళ్ళా చూస్తున్నాడు. అప్రయత్నంగా ఆమె అతని చేతిని పట్టుకుంది. గంగాధర్ చెయ్యి చల్లగా వుంది. ఆమె వేళ్ళు వణుకుతున్నాయి. అతను ఆమె చేతిని తీసి

చేయలేదు. ఆమెవైపు చూడలేదు. చీకట్లో అతని మొహాన్ని చదవడానికి శశిప్రియ వ్యర్థప్రయత్నం చేసింది.

సన్న మూలుగు ఆమె దృష్టిని తెరవైపు లాగింది. ఆమె శరీరం ఒక్కసారిగా చల్లబడింది. పొడుగ్గా, లావుగా వున్న యువకుడు మంచంమీద నగ్నంగా పడుకున్నాడు. అతనిమీద..తను...తనేనా? శశిప్రియ తలలో రాకెట్లు విపరీతంగా శబ్దంచేస్తూ దూసుకెళ్తున్నాయి. చెవుల్లో భయంకరమైన హోరు. కళ్ళు తిరుగుతున్నాయి. ఏమాత్రం సిగ్గూ, సంశయం లేకుండా తను అతనిమీద... తన మొహం అతని మొహంమీదికి వాలింది. వాలుగు పెదవులు రెండుగా కరిగి అతుక్కుపోయాయి. సన్నగా చప్పుడు. తన శరీరం వెర్రిగా, వెర్రిగా, వేగంగా కదులోంది. కడుపులోంచి తన్నుకొస్తున్న వాంతిని శశిప్రియ బలవంతాన ఆపుకుంది.

గంగాధర్ వేపు కంగారుగా చూసింది. అతను ఊపిరి పీల్చుకొని విగ్రహంలా కూచున్నాడు. ఆమె చెయ్యి అతని మణికట్టువేపు భయం భయంగా పాకింది. గంగాధర్ హార్టు....ఫెయిలైందా? టకటక కొట్టుకుంటున్న నాడి ఆమె వేళ్ళకి తగిలింది.

మరో కేక ఆమె దృష్టిని తెరవైపు లాగింది. తన ఆకారం ఇప్పుడు మంచంమీద అడ్డంగా పడివుంది. కాళ్ళు నేలని తాకుతున్నాయి. అతను కింద నించున్నాడు. అతను....అతని శరీరాన్ని, భయంకరంగా, అసహ్యంగా లజ్జలేకుండా అవుపిస్తున్న అతని శరీరాన్ని మరిచిపోతూ ఆమె అతని మొహంమీద దృష్టిని కేంద్రీకరించింది. ఎవరు? ఎవరతను? శశిప్రియ కళ్ళు మూసుకుంది. ఏదో

చీకటి అగాధంలోకి తను వేగంగా జారిపోతోంది. చిక్కటి కాటుక సముద్రంలో మునిగిపోతోంది. తారు లాంటి అలలు తనని మింగేస్తున్నాయి.

ఉన్నట్టుండి తన చేతిని ఎవరో లాగుతున్నారు... చెయ్యి పట్టుకుని తనని కాటుక సముద్రంలోంచి ఇవతలికి లాగుతున్నారు. శశిప్రియ ఉలికిపాటుతో కళ్ళు తెరిచింది. తనని యెవరూ లా గ డం లే దు. తన వేళ్ళమధ్యనుంచీ గంగాధర్ చెయ్యి విడిపించుకోబడింది. అతను అటు వేపు నిలబడ్డాడు. అప్రయత్నంగా ఆమె లేచింది. తూలిపడ బోతూ నిలదొక్కుకుంది.

తెరమీంచీ తను విచిత్రంగా పెడుతున్న చిన్న కేకలూ, మూలుగులూ ఆమె దృష్టిని బలవంతంగా లాగాయి. కళ్ళు మూసుకుని తలని ఆవేశంతో అటూ ఇటూ ఆడిస్తూ తను అర్థంలేని చప్పుళ్ళు చేస్తోంది. చర్మం వొలిచేసిన జింకతో కసాయివాడు శాడిస్టిక్‌గా ఆడు కుంటున్నట్టు యెవరో రాక్షసుడు తన శరీరాన్ని....కానీ ఆ కసాయివాడి కార్యక్రమాన్ని తను సంపూర్ణంగా, హాయిగా ఎంజాయ్ చేస్తోంది!

బాక్స్‌లో తనొక్కతే వున్నట్టు ఆమె గుర్తించింది. కంగారుగా ఇవతలికి పరుగెత్తింది. పదడుగుల దూరంలో తల వాల్చుకుని, రెండు చేతుల్నీ కోటుజేబుల్లో దోపు కుని గాయపడిన పైనికుడిలా నడుస్తున్నాడు గంగాధర్. తడబడే అడుగుల్తో ఆమె అతన్ని వెంబడించింది. చెమ టతో తన శరీరం తడిసి ముద్దయినట్టు శశిప్రియ గుర్తిం చింది. మెదడు పూర్తిగా మొద్దుబారిపోతోంది. అప్ర యత్నంగా పట్టుచీర చెంగుని తలమీదుగా కప్పుకుని భర్తను అనుసరించింది.

గంగాధర్ వెనుతిరగలేదు. మంత్రముగ్ధుడిలా, స్లీప్ వాకర్‌లా కదులుతున్నాడు. అండర్‌గ్రౌండ్ థియేటర్లోంచీ తను ఎలా బైటికి వచ్చిందో శశిప్రియకి తెలీదు. హోటల్ దాకా ఎలా నడిచిందో ఆమెకి తెలీదు....

మూసిన తలుపుకి బలహీనంగా జార్లాబడి అలాగే నిలబడిపోయిందామె. గదిలో ఆమె లేనట్టే గంగాధర్ ప్రవర్తిస్తున్నాడు. ఆమెవేపు చూడకుండా సూటు విప్పేశాడు. లుంగీ కట్టుకుని బాత్‌రూమ్‌వైపు నీరసంగా కదిలాడు. చెమటతో తడిసి బిగుసుకుపోయిన అతని మొహాన్ని కన్నీటి తెరల వెనకనుంచీ చూసిందామె. ఆర్నెల్లపాటు జబ్బుతో మంచంపట్టి, అప్పుడే లేచి మొదటిసారి నడుస్తున్న వ్యక్తిలా మెల్లిగా నడుస్తున్నాడు గంగాధర్. బాత్‌రూం తలుపు మూసుకుంది.

దుఃఖం వెల్లువలా ఆమెలోంచీ పొంగుతోంది. శశిప్రియ మంచంవేపు కదిలింది. అడ్డంగా బోర్లాపడిపోయి వెక్కి వెక్కి ఏడవసాగింది. ఏడుపు ఆమె భుజాల్నీ, వీపునీ గడగడ వణికిస్తోంది. ఏడుపు కన్నీళ్ళ రూపంలో ఆమె మొహాన్నీ, మెత్తటి పరుపునీ తడిపేస్తోంది....

* * *

శశిప్రియ ఉలిక్కిపడింది. ఆమె శరీరంలోని సర్వశక్తినీ ఏడుపు కన్నీళ్ళరూపంలో ఖాళీ చేసేసినట్టుంది. మెల్లిగా తలెత్తి మంచంమీద చూసింది. గంగాధర్ లేడు. శశిప్రియ గుండె దడదడ కొట్టుకుంది. కంగారుగా మంచంమీంచీ కిందికి దిగిందామె. తడబడే అడుగులతో బాత్‌రూమ్‌వేపు కదిలింది. బాత్‌రూమ్‌లో అతను లేడు. దుఃఖాన్ని దిగమింగే ప్రయత్నంలో పంటితో కింది పెదవిమీద గాటుపడుతోంది.... కింద, మంచం దగ్గర

కుప్పగా పడున్న గంగాధర్ గ్రే కలర్ సూట్ మీద ఆమె చూపులు వాలాయి.

శశిప్రియ గుమ్మంవేపు కదిలింది. వణికే చేత్తో తలుపు లాగింది. ఒక్కసారిగా ఆమె గుండె దడ తగ్గింది. ముందు గదిలో సోఫామీద వెనక్కి వాలి, కాళ్ళని టీపాయ్ మీద పెట్టి గది కప్పుని తదేకంగా చూస్తున్నాడు గంగాధర్. అతని పెదాలమధ్య సిగరెట్ వెలుగుతోంది. పొగ మేఘంలా అతని పైన వేళ్ళాడుతోంది! గంగాధర్ మళ్ళీ సిగరెట్ కాలుస్తున్నాడు!

శశిప్రియ వేగంగా అతనివైపు కదిలి, కొంచెం దూరంలో తటాలున ఆగింది. అతని కాళ్ళ పక్కన టీపాయ్ మీద సగంపైగా ఖాళీ అయిన షివాస్ రీగల్ విస్కీ బాటిలుంది. పక్కనే ఖాళీలోటా....శశిప్రియ ఆశ్చర్యంతో నోరు తెరుస్తూ అతన్ని సమీపించింది. గంగాధర్ తలతిప్పలేదు.

శశిప్రియ అమాంతం సోఫాలో కూలిపోయి, అతని వొళ్ళో తల దూర్చి వెక్కి వెక్కి ఏడవసాగింది. ఆమె చేతులు పెనుగాలిలో లేత తీగల్లా వణుకుతూ అతని శరీరాన్ని చుట్టే ప్రయత్నం చేస్తున్నాయి. గంగాధర్ చెయ్యి కదల్లేదు. ఆమె తలమీద వాలలేదు.

తన తల కిందినుంచీ అతను దూరంగా జరుగుతున్నట్టు ఆమె గుర్తించింది. అతని శరీరంమీంచీ ఆమె చేతులు బలహీనంగా జారాయి. ఆమె ముఖానికి సోఫా మెత్తగా, చల్లగా తగిలింది. విస్కీ లోటాలోకి దూకుతూ చప్పుడు చేస్తోంది. శశిప్రియ తటాలున తలెత్తి చూసింది.

లోటా అందుకుని అతను నిటారుగా నించున్నాడు.

అటు వేపు తిరిగి ఒక్క గుక్కలో దాన్ని ఖాళీచేశాడు.

"ఏమండీ....." శశిప్రియ ఏడుపు అతికష్టం మీద పిలుపుగా మారింది. గంగాధర్ మరబొమ్మలా తల తిప్పాడు. ఎర్రగా వున్న అతని కళ్ళల్లో చైతన్యం, జీవం లేవు. విశ్వంలోని దుఃఖం, ఓటమీ ఆ కళ్ళల్లో స్పష్టంగా అవుపిస్తున్నాయి.

"నేను.... నేను.. ఏ పాపం ఎరగను....మీరు తప్ప నన్ను ఎవ్వరూ....తాకలేదని మీకు తెలుసు....అదంతా ఏమిటో....ఆ....తెరమీద....అన్యాయం.... ఏమిటో.... నిజంగా నాకు తెలీదు...." ఏడుపు ఆమెకి అడ్డుతగిలింది.

గంగాధర్ తదేకంగా క్షణకాలం ఆమె కళ్ళల్లోకి చూశాడు. నూనె రాసినట్టు అతని మొహం చెమటతో మెరుస్తోంది. మెల్లిగా అతని పెదవులు కదిలాయి. చిరునవ్వు అతని కండరాల్ని కదిలించింది. జీవంలేని చిరునవ్వది. ఓటమిని కళ్ళకి చూపించే చిరునవ్వు. కిందికి వొంగి విస్కీ బాటిల్ని అందుకున్నాడతను. మెల్లిగా బెడ్ రూమ్ వేపు కదిలాడు.

"ఏ....మం .. డీ !" శశిప్రియ దీనంగా అరిచింది. గంగాధర్ మెల్లిగా వెనక్కి తిరిగాడు. వణుకుతూ సోఫాలో కూచుని, కన్నీళ్ళతో తనని ప్రాధేయపూర్వకంగా, దయనీయంగా చూస్తున్న శశిప్రియ మొహంలోకి అయోమయంగా చూశాడు. అతని పెదవులు అదిరాయి.

"మాక్సీ లేకుండా నా కళ్ళకి కనపించాలంటే నీకు.. చచ్చేంత సిగ్గు! కదూ?" గంగాధర్ కంఠం బొంగురుగా వుంది.

శశిప్రియ భోరున ఏడుస్తూ రెండు చేతుల్లో మొహాన్ని

దాచుకుంది. బిగ్గరగా చప్పుడు చేస్తూ బెడ్ రూమ్ తలుపు మూసుకుంది. కన్నీళ్ళతో ఆమె అరచేతులు తడుస్తున్నాయి.

3

శశిప్రియ కన్నీళ్ళతో డిటెక్టివ్ టెంపోని చూసింది. టెంపో ఆమెని సానుభూతితో చూశాడు. పారిస్ ప్రణయం—వివరించడానికి ఆమెపడ్డ నరకయాతన ఆ కళ్ళల్లో స్పష్టంగా అవుపిస్తోంది.

"తరవాత?" ప్రశ్నించాడు టెంపో.

"గంగాధర్ నామీద విరుచుకుపడలేదు. కనీసం కోపం ప్రకటించలేదు. బంగారు బొమ్మ బదులు మట్టి బొమ్మ తనకి లభించిందన్న వోటమి, దైన్యం తప్ప మరో భావం ఆయన మొహంలో కనిపించలేదు. ఆయన తిట్టినా నాకు కొంత శాంతి లభించి వుండేది...." శశిప్రియ చెప్పుకుపోతోంది.

"పారిస్ హోటల్ బెడ్ రూమ్ తలుపు మూసుకుంది. తరవాత?" టెంపో ఆమెని అసలు విషయంలోకి లాగాడు.

"ఆయన ఆ గదిలో, నేను ముందుగదిలో.... వుండిపోయాం. ఆ తరవాత నేను లేనట్టే ప్రవర్తించాడాయన. హనీమూన్ కాన్సిల్ చేశాడు. ఆయన విమానం ఎక్కాడు. నేనూ ఎక్కాను. ఇద్దరం ఇంటికి వచ్చాం. నన్ను వొదిలేసి, ఎటో వెళ్ళిపోతాడని హడిలిపోయాను. ఆయన నన్ను ప్రాణంలా ప్రేమించాడు. ఏదీ తేల్చుకోని అయోమయ స్థితిలో కొంతకాలం వుండిపోయాను. పారిస్ బ్లూ ఫిలిమ్ ఆయనకి నన్ను దూరం చేసింది; విస్కీని దగ్గర చేసింది. ఈ ఆర్నెల్లగా ఇద్దరం అపరిచిత వ్యక్తుల్లా ఒకే

కప్పుకింద జీవిస్తున్నాం."

టెంపో తలపంకిస్తూ సిగరెట్ వెలిగించాడు.

"నేను ఏ అపరాధం చేయలేదనీ, ఆ ఫిల్ములోని మిస్టరీ ఏమిటో అర్థంకావడంలేదనీ, నిజాన్ని తేల్చి ఏదో నిర్ణయం తీసుకుందామనీ చెప్పి చూశాను. నా నిజాయితీని విప్పిచెప్పడానికి ప్రయత్నించాను."

"గంగాధర్ ఏమన్నాడు?" టెంపో ప్రశ్నించాడు.

"మిస్టర్ టెంపో! రాతివిగ్రహం ముందు మాట్లాడితే ఏ రెస్పాన్స్ వస్తుందో అదే వచ్చింది...."

టెంపో ఆశ్చర్యంగా చూశాడు.

"గంటసేపు నేను మాట్లాడినా గంగాధర్ పెదవి కదపడు. మాట్లాడే శక్తిని కోల్పోయిన వ్యక్తిలా, ప్రపంచంలోని బాధనంతా పోగుచేసి నింపుకున్న గిన్నెలాంటి కళ్ళతో నా మొహంలోకి చూస్తాడు. మెంటల్ షాక్ లాంటిది తగిలిందేమో అని భయపడ్డాను. గంగాధర్ కి తెలీకుండా సైకియాట్రిస్టు సుహాసినిని ఆయన్ని పరీక్షించమన్నాను. నాలుగు వారాలు టెస్టుచేసి గంగాధర్ నార్మల్ గా వున్నాడంది ఆమె!"

"ఆల్ రైట్.... ఈ క్యాసెట్ ఎక్కడిది?" టెంపో విషయం మార్చి ప్రశ్నించాడు.

"పారిస్ లో ప్రత్యక్షమైన క్యాసెట్ ఇంకా ఎక్కడెక్కడ ప్రదర్శించబడుతోందో అని హడిలి చచ్చిపోయాను. తిరిగి రాగానే శేఖర్ ని ఆ పనిమీద నియమించాను...."

"శేఖర్ ఎవరు?"

"నన్ను చిత్రరంగానికి పరిచయం చేసిన వ్యక్తి. నా డైరీ అతనే చూసేవాడు."

"చూసేవాడు అంటే ఇప్పుడు చూడ్డం లేదా?" టెంపో అడిగాడు.

"ఆర్నెల్లుగా గంగాధర్ ఆ పని చూస్తున్నాడు. గతాన్నీ, వర్తమానాన్నీ మరిచిపోడానికి తనకి ఆ పని అవసరం అన్నాడు. పారిస్‌నుంచీ తిరిగొచ్చాక నాతో మాట్లాడింది ఆ వొక్కసారే! ఏదో వ్యాపకం చేతిలో వుంటే గంగాధర్ మామూలు మనిషి అవుతారనీ మా అనుబంధం చక్కబడుతుందనీ భావించాను. అన్నట్టు 'డైరీ' అంటే మీకు తెలుసనుకుంటాను."

"ప్రొడ్యూసర్స్‌కి నీ కాల్‌షీట్స్ ఇవ్వడం" టెంపో నవ్వుతూ అన్నాడు. "రైట్, శేఖర్ని క్యాసెట్ పని మీద నియమించావు."

"యస్. ముందట ఇండియా అంతా గాలించమన్నాను. దొరికినచోట ఎంత డబ్బయినా పారేసి క్యాసెట్స్‌ని కొనేయమన్నాను. నాలుగు నెలలపాటు శేఖర్ భూప్రదక్షిణం చేశాడు. ఇంగ్లండ్, అమెరికా గల్ఫ్‌కంట్రీస్, ఆఫ్రికా .... ఒకటేమిటి? అన్నీ. చివరికి పారిస్‌లోనే ఈ కాసెట్‌ని అతను పట్టాడు. కొన్ని లక్షల ఖర్చుతో ఈ క్యాసెట్ సంపాదించగలిగాను...."

"కాపీలు వుండొచ్చు!"

"ఉండొచ్చు....ఇవాళ కాకపోతే రేపు మార్కెట్లో కోకొల్లలుగా పుట్టుకురావొచ్చు. అది జరక్కుండా ఆపాలి!" శశిప్రియ ఉద్రేకంతో అంది.

డిటెక్టివ్ టెంపో ఫ్లాస్క్‌లోని టీని రెండు కప్పుల్లో పోశాడు. శశిప్రియ కృతజ్ఞతతో చూస్తూ ఒక కప్పు అందుకుంది.

"బ్లూ ఫిలిమ్స్ అమ్మే ప్రతిచోటా, అద్దెలకిచ్చే ప్రదేశాల్లో, ప్రదర్శించబడే ప్రదేశాల్లో శేఖర్ నిర్విరామంగా ప్రయత్నించాడు. అయినా, ఎక్కడో మరొక కాపీ దాక్కుని వుండొచ్చు. అంచేత మీరు అన్నిచోట్లా, అన్ని దేశాల్లో ప్రయత్నించి...."

టెంపో చెయ్యెత్తి ఆమెని వారించాడు. టీ కప్పుని కింద పెట్టి సిగరెట్ వెలిగించాడు. ఆమెవేపు తదేకంగా చూశాడు.

"శశిప్రియా. సముద్రంలో కలిసిపోయాక ఇంకువని పట్టుకోలేం. లోకమంతా వెతకడం కన్నా, ఈ క్యాసెట్ ఎక్కణ్నుంచీ పుట్టుకొచ్చిందో ముఖ్యంగా మనం కని పెట్టాలి!"

శశిప్రియ మాట్లాడకుండా చూసింది.

"ఈ సమస్యని ఎదుర్కోడానికి సరైన పద్ధతి అదే. దానికి నీ సహాయం పూర్తిగా, సంపూర్తిగా కావాలి."

"చెప్పండి. ఏం కావాలి?" శశిప్రియ ఉద్రేకంతో అంది.

"నిజం!"

శశిప్రియ కళ్ళు చిట్లిస్తూ చూసింది. టెంపో చిరునవ్వు నవ్వాడు.

"నేనడిగే ప్రశ్నలకి నువ్వు ఖచ్చితంగా నిజమైన సమాధానాలు చెప్పాలి!"

"అబద్ధాలాడాల్సిన అవసరం నాకు లేదు. అడగండి!" అందామె ఆవేశంతో.

"క్యాసెట్లోని ఆ వ్యక్తి ఎవరు?"

"తెలీదు."

"పెళ్ళికి ముందు నీకు ఎవరెవరితో శారీరక సంబంధం

వుందేది?"

శశిప్రియ దెబ్బతిన్నట్టు చూసింది.

"శీలాన్ని సంతర్పణచేస్తేగానీ సినిమారంగంలో పైకి రావడం అసంభవమన్నది దాదాపుగా నిజమే. కానీ నా విషయంలో అది అబద్ధం. శరీరంతో కాకుండా సౌందర్యంతో నేను వెండితెరమీదికి ఎక్కాను. శరీరంతో కాకుండా టాలెంట్‌తో తారాపథం చేరుకున్నాను..."

టెంపో చిన్నగా నవ్వాడు. "సినిమా ప్రపంచంలో అని నేను అడగలేదు. 'పెళ్ళికి ముందు' అన్నాను!"

"మిస్టర్ టెంపో, గంగాధర్‌తో పెళ్ళి జరిగేదాకా నేను కన్యనే!"

టెంపో తలపంకిస్తూ సూటిగా ఆమె కళ్ళల్లోకి చూశాడు. "పెళ్ళి జరిగాక?"

శశిప్రియ చిన్నగా నవ్వింది. "పెళ్ళయ్యాక ఏ ఆడదీ కన్యగా కంటిన్యూ కాలేదని మీకు తెలుసు!"

టెంపో నవ్వలేదు. "పెళ్ళయ్యాక నీ కన్యాత్వం గురించి నేను ప్రశ్నించలేదు. పెళ్ళయ్యాక, నీ భర్త కాకుండా మరెవరేనా...."

"మిస్టర్ టెంపో....అయామ్ సారీ....నా భర్త గంగాధర్ ఒక్కడికే నేను భార్యను. ఆ మగాడికి ఒక్కడికే నేను ఆడదాన్ని!"

"పెళ్ళికిముందు ఏ మగాళ్ళతో శారీరక సంబంధం లేదు. పెళ్ళయ్యాక వేరే మగాడితో సంబంధం లేదు. మరి 'అది ఎలా తయారైంది?" టెంపో ప్రశ్నించాడు.

"అదే అర్థం కావడంలేదు...." శశిప్రియ నిస్పృహయంగా అంది.

డిటెక్టివ్ టెంపో సోఫాలోంచీ లేచాడు. పాంటు

జేబుల్లో చేతులు దూర్చి పచార్లు ప్రారంభించాడు. శశి ప్రియ తల అతను ఎటు తిరిగితే అటు తిరుగుతోంది. టెంపో టటాలున ఆగి ఆమెని తదేకంగా చూశాడు.

"శశిప్రియా, నీ ముఖం మాత్రం నేను చూడగలుగు తున్నాను. ఫిల్మ్‌లో 'నీ మొహం' మాత్రం నీదిగా నేను గుర్తించగలను. ముఖం కాకుండా తతిమ్మా శరీరం.... నీదో కాదో నాకు తెలీదు...." టెంపో ఆగాడు.

"నాకు తెలుసు: నాదే!"

టెంపో సాలోచనగా తల పంకించాడు. "ఆ మధ్య పేపర్లలో చదివే వుంటావు....ఒకానొక హిందీ నటి, ఒకానొక సినిమాలో ఒక మోస్తరుగా వివస్త్ర అయ్యే సీనుంది. ఆ తరవాత ఆ నటి నటించిన-నటించిన అనాలో పాల్గొన్న అనాలో నాకు తెలీదు—బ్లూ ఫిలిం క్యాసెట్లుగా వచ్చేసింది ."

"తెలుసు...."

"సినిమాలో గుడ్డలు ఊడదీసుకుంటున్న బిట్‌కి చాకచక్యంగా కంటిన్యుటీ అందించి, ఆ నటి మొహానికి మరో ఆడదాని శరీరాన్ని అతికించి ఆ బ్లూ ఫిలిం తయారు చేయబడిందని తరవాత బైటపడింది...."

"తెలుసు. అలాంటి అవకాశం ఇక్కడ లేదు. అయిదడుగుల అయిదంగుళాలూ సాక్షాత్తూగా శశిప్రియే!'

"నువ్వు ఇక్కడికొస్తున్నట్టు ఎవ్వరికి తెలుసు?" టెంపో ఉన్నట్టుండి విషయం మార్చి ప్రశ్నించాడు.

"వంటమనిషికే చెప్పాలి. ఫ్రెండింటికి వెళ్తున్నట్టు చెప్పాను. ఫ్రెండింటికి వెళ్ళాను. నా కార్ని అక్కడ వదిలేశాను. ఆమె కారు తీసుకొచ్చాను. జనం నా కార్ని గుర్తుపడ్తారు. అది ప్రమాదం...."

"అయితే నువ్విక్కడికి రావడం ఎవ్వరికీ తెలీదన్న మాట?" టెంపో అడ్డొస్తూ ప్రశ్నించాడు.

"తెలీదు. సుజాత ఇంటికి వెళుతున్నట్టు నా ఫ్రెండుకి చెప్పాను."

"గుడ్. చాలా పొద్దుపోయింది. నువ్వెళ్ళిపో. ఏం చేయాలో ఆలోచిస్తాను ..."

శశిప్రియ బాగ్ లోంచీ వందరూపాయల కట్టలుతీసి, టీపాయ్ మీద పెట్టింది. టెంపో వేపు చిరునవ్వుతో చూసింది, "మున్ఫై వేలు. టోకెన్ అడ్వాన్స్! తరవాత ఎప్పుడు ఎంత కావాలంటే అంత ఇస్తాను. ఖర్చుకి వెన కాడకండి. ఆ ఫిలింలోది నేను కాదని నిరూపించండి. నా భర్తతో నన్ను కలపండి!"

టెంపో ఆమెవైపు అదోలా చూస్తూ సిగరెట్ వెలిగించాడు.

"గంగాధర్ కి నువ్వంటే యెంతో ప్రేమ అంటున్నావు. అతని ప్రేమ దీన్ని మన్నించలేదా?"

"శశిప్రియ నిట్టూర్చింది. "మిష్టర్ టెంపో, గంగాధర్ కి అదొక భయంకరమైన షాక్. అతని నమ్మకానికి దెబ్బ. అతని ప్రేమకి అగ్నిపరీక్ష. ప్రేమ వుంది కనకే ఇంకా నా దగ్గరే వున్నాడు. లేకపోతే ఎప్పుడో, ఎటో వెళ్ళిపోయేవాడు! నా నిజాయితీని నమ్మడానికి అతను ప్రయత్నిస్తున్నాడు. ఆ ప్రయత్నానికి దోహదం చేసే సాక్ష్యాన్ని సరఫరా చేస్తే గంగాధర్ మళ్ళీ మునుపట్లా అవుతాడు!"

"ఐసీ...." టెంపో మెల్లిగా అన్నాడు.

"తనని నిర్లక్ష్యం చేస్తూ, మరో ఆడదానితో సంబంధం పెట్టుకున్న భర్తని స్త్రీ సులువుగా క్షమిస్తుంది.

తనని నిర్లక్ష్యం చేస్తూ మరో మగాడితో తిరిగే భార్యని మగాడు అంత సులువుగా క్షమించలేడు! ప్రస్తుతం గంగాధర్ అదే స్థితిలో, ఆరాటంలో వున్నాడు!" శశిప్రియ ఉద్రేకంతో అంది.

"పెళ్ళిముందుగానీ, పెళ్ళయ్యాకగానీ, ఎప్పుడేనా నువ్వు హెరాయిన్, మారిజువానా, హాషీష్‌లాంటి మాదక ద్రవ్యాల్ని శాంపిల్ చూశావా?"

శశిప్రియ ఉలిక్కిపడింది. "ఎందుకలా అడుగుతున్నారు?"

"వాటిని ఉపయోగిస్తే నువ్వు మేఘాలమీద ఎగురుతూ వుంటావు అలాంటి స్థితిలో నువ్వేం చేస్తున్నావో నీకు తెలీదు. అలాంటి స్థితిలో వున్న నిన్ను వాడుకుని ఎవరేనా ఆ ఫిలిం తీసివుండొచ్చు...." టెంపో వివరించాడు.

"టెంపోగారూ, నేను నిద్రమాత్రకూడా వేసుకోను! నన్ను నమ్మండి!" శశిప్రియ ఆవేశంతో అంది.

"నీకు తెలీకుండా ఎవరేనా నీమీద వాటిని ప్రయోగించి వుండొచ్చు...."

శశిప్రియ తల ఆవేశంతో వూగింది. "నెవర్! నే నెప్పుడూ అలాంటివాళ్ళతో కలిసి తిరగలేదు!"

"ఓకే. నువ్వు తాటిచెట్టుకిందికి వెళ్ళలేదు. పాలు తాగలేదు. అయితే నువ్వు తాటిచెట్టుకింద వొళ్ళు మరిచి కల్లు త్రాగినట్టు బ్రహ్మాండమైన సాక్ష్యాలున్నాయి!" టెంపో చిన్నగా నవ్వాడు.

"మిస్టర్ టెంపో, ఆ సాక్ష్యాలు అబద్ధాలని నిరూపించండి. నా నిజాయితీని నిరూపించండి' నాలో కళంకం లేదని నా భర్తకి చాటిచెప్పండి! దీనికంతకీ

కారకులైన వ్యక్తుల్ని పట్టుకుని శిక్షించండి!" లేచి నిలబడి శశిప్రియ ఉద్రేకంతో అంది.

"ప్రయత్నిస్తా. వెళ్ళిరా. నాకు నీ ఫోన్ నంబరు కావాలి...." అన్నాడు టెంపో.

శశిప్రియ చిన్న కార్డుతీసి అందించింది. అతనివైపు అనుమానిస్తూ చూసింది.

"క్యాసెట్ ...."

"క్యాసెట్ నా దగ్గరే వుంటుంది."

"టెంపోగారూ, ఇదేదో తెలితేగానీ నాకు భవిష్యత్తులేదు. యాంత్రికంగా సినిమాల్లో నటిస్తున్నా..." శశిప్రియ దీనంగా అంది.

"నువ్వు త్వరగా, అతిత్వరగా తారాజువ్వలా పైకి చేరుకున్నావు. శశిప్రియా, నీ కెవరేనా శత్రువులున్నారా?"

"ఎవ్వరూ లేరు. ఇంకా బైటపడకుండా శత్రుత్వాన్ని పెంచుకుంటూ ఎవరేనా ఉన్నారేమో నాకు తెలీదు!"

"ఓ.కే. రేపు ఉదయం శేఖర్ నన్ను కల్సుకోవాలి. వెళ్ళిరా. గుడ్ నైట్!"

4

"టెంపోగారూ, నమస్కారాలు. శశిప్రియ నన్ను పంపించింది...."

"కమిన్ శేఖర్!" టెంపో నవ్వుతూ అన్నాడు.

పొడుగాటి ఆకారం. పొడుక్కి తగ్గ లావు. కోల మొహం. వంకీలు తిరిగిన క్రాఫు. సన్నటి మీసాలు. శేఖర్ గదిలోకి వచ్చి, టెంపో ఎదురుగా సోఫాలో కూచున్నాడు.

"శేఖర్, శశిప్రియ క్యాసెట్‌ని ఎలా సంపాదిం

చావు?" టెంపో ప్రశ్నించాడు.

"ఇంగ్లండ్ .... యూఎస్ఏ ...." శేఖర్ ప్రారంభించాడు.

"మళ్ళీ ఆ దేశాలన్నీ మనం తిరగొద్దు నేరుగా పారిస్‌లోని ఓడియన్ థియేటర్‌కి వెళ్దాం?" టెంపో అడుకగిలి నవ్వాడు.

శేఖర్ చిన్నగా నవ్వాడు. అతని కళ్ళ చివర్లలో సన్నటి గీతలు ఏర్పడ్డాయి. "ఓడియన్ థియేటర్ ప్రొప్రయిటర్ విక్టర్ ఫ్రాన్స్‌ని కలుసుకున్నాను. నాకు కావాల్సిన క్యాసెట్‌ని ట్రేస్ చేయడానికి చాలా శ్రమపడ్డాను. చాలా ఖర్చుచేశాను. లేట్ షోస్ అయిపోయాక అతని స్టాక్‌లో వున్న పాతిక బ్లూస్‌ని శాంపిల్స్ చూశాను. మిస్టర్ టెంపో, దేశదేశాలూ తిరగడంకన్నా అది చాలా కష్టమైన పని! చివరికి ఇరవై యేడో ఫిల్మ్ మనది. మన కరెన్సీ లెక్కలో లక్షా పాతిక వేలు ఇచ్చేదాకా అతను క్యాసెట్ ఇవ్వలేదు!"

"అతను కాపీలు తీసుకున్నాడా?" డిటెక్టివ్ టెంపో ప్రశ్నించాడు.

"లేదనే అన్నాడు. అతనికి అనుమానం రాకుండా అడిగిచూశాను. అతన్ని నమ్మొచ్చనే అనుకుంటున్నా. ఎందుకంటే ఆ క్యాసెట్‌లోనిదంతా 'డల్ స్టఫ్' అన్నాడతను ...."

టెంపో ప్రశ్నార్థకంగా చూశాడు.

"నాచురల్ ఇంటర్‌కోర్స్ ప్రస్తుతం ప్రేక్షకులకి మరీ సాదా అయిపోయింది. అది చాలా సింపుల్. పర్వర్టెడ్ కాంజుగల్ యూనియన్‌లో మాత్రమే వాళ్ళకి కావాల్సింది దొరికేలా వుంది! అయినా సాదా సెక్సుని

లైక్ చేసే వ్యక్తులూ వుంటారు కాబట్టి విక్టర్ ఫ్రాన్స్ అడగ్గానే అమ్మడానికి నిరాకరించాడు...." శేఖర్ ఆగి, చూశాడు.

టెంపో అతన్ని సూటిగా చూశాడు. "శేఖర్, ఆ ఫిల్మ్‌లో తల మాత్రం శశిప్రియది, శరీరం మరొకరిదీ అవొచ్చా?"

శేఖర్ ఇబ్బందిగా చూశాడు. "లేదనుకుంటాను. శశి....ప్రియ అలా అనుకోవడంలేదు...."

"ఆమె ఉద్దేశం అటుంచు. నువ్వేమంటావ్?"

"తలనుంచీ కాళ్ళదాకా ఆమే అనుకుంటున్నాను."

టెంపో లేచి, సిగరెట్ వెలిగించి, అతనిముందు పచార్లు చేయసాగేడు. ఆగి, అతని కళ్ళల్లోకి తీక్ష్ణంగా చూశాడు.

"నీకెలా తెలుసు?"

టెంపో ప్రశ్న చెంపదెబ్బలా తగిలిందతనికి. ఒకసారి నాలుకతో పెదాల్ని తడుపుకున్నాడతను. మాట్లాడకుండా, అర్థంకానట్టు టెంపోని చూశాడు.

"శేఖర్, శశిప్రియను ఆ ఫిల్మ్‌లో నువ్వు నగ్నంగా చూశావు. సాక్షాత్తుగా ఆమెని నగ్నంగా చూస్తే కానీ ఫిల్మ్‌లోని శరీరం ఆమెదో కాదో నీకు తెలీదు! అవునా?" టెంపో గంభీరంగా ప్రశ్నించాడు. అతని కళ్ళు శేఖర్ చూపుల్ని లాగిపట్టాయి.

శేఖర్ మొహం సిగ్గుతో ఎరుపెక్కింది. అతను అయోమయంగా చూస్తూ విగ్రహంలా కూచుండిపోయాడు. మెల్లిగా తెప్పరిల్లి చిరునవ్వు నవ్వే ప్రయత్నం చేశాడు.

"తలపైనుంచి ప్రహార్ష నెట్‌గా, బాడీ వుంది. పైగా

శశిప్రియ అది తనే అని అంటోంది. అందువల్ల అలా అనుకున్నాను...."

"అంటే, ఫిల్మ్‌లోని స్త్రీ పూర్తిగా శశిప్రియే అని నువ్వు ఖచ్చితంగా చెప్పలేవు! అంతేగా?" టెంపో ప్రశ్నించాడు.

"....ఆఫ్‌కోర్స్. అయితే...."

"శేఖర్, ఒక ఎక్స్‌పర్టు కెమెరామన్ నాకు కావాలి" టెంపో ఆడ్డొస్తూ అన్నాడు. "అతను శశిప్రియ చిత్రాలకి పనిచేసిన వ్యక్తి అయితే మరీ మంచిది."

"గిరీశ్ ఆర్యకి ఎక్స్‌పర్టుగా మంచి పేరుంది. ట్రిక్ ఫొటోగ్రఫీలో ఆయన బాబూభాయ్‌మిస్త్రీని మించిపోయాడు. అయితే అతనికి తీరిక వుండదు...."

"శశిప్రియ చిత్రాలకి అతనే పనిచేశాడా?" టెంపో అడ్డొస్తూ అడిగాడు.

"ప్రస్తుతం ఆమె నటిస్తున్న ఎనిమిది చిత్రాలకీ ఆయనే పనిచేస్తున్నారు....అయితే...."

"అయితేలూ, గియితేలూ లేవు, శేఖర్! రాత్రి ఏడు గంటలకి అతను ఇక్కడుండాలి! అవసరమైతే శశిప్రియకి భయంకరంగా పడిశం పట్టేస్తుంది. షూటింగ్ కాన్సిలవుతుంది!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"శశిప్రియ చేస్తున్న ఎనిమిది చిత్రాలూ చాలా పెద్ద ప్రొడ్యూసర్స్‌వి. పైగా గంగాధర్ గారు ఆ కాల్ షీట్స్ ఫిక్స్ చేశారు. శశిప్రియ ఏ కారణం చేత షూటింగ్ కాన్సిల్ చేయించినా, ప్రొడ్యూసర్ గంగాధర్ గార్ని కలుస్తుంటాడు. ఆయన ఆ ఫెండవుతాడు....అసలే....వాళ్ళిద్దరికీ ధ్యాం బొత్తిగా బాగోలేదు...." అన్నాడు శేఖర్ మెల్లిగా.

డెంపో మౌనంగా సిగరెట్ ముట్టించి, శేఖర్ వైపు చూస్తూ సోఫాలో కూచున్నాడు. "శేఖర్, హనీమూన్ తరువాత కూడా గంగాధర్ ఆమె వైపే చూస్తున్నాడా?"

శేఖర్ తలాడించాడు. "ఆయనే చూస్తున్నారు.... మనోవ్యాకులతవల్ల కాల్‌షీట్స్‌ని సక్రమంగా ఆయన డిస్ట్రిబ్యూట్ చేయడంలేదని అనుకుంటున్నా. ఆమెకి ఇతర ఆర్టిస్టులకీ, ప్రొడ్యూసర్లకీ, డైరెక్టర్లకీ ఆ కాల్ షీట్స్ మరీ క్రౌడెడ్‌గా వున్నాయి. శశిప్రియకు మార్కెట్ వాల్యూ వుంది గనక అందరూ కిక్కురుమనకుండా వున్నారు. ముఖ్యంగా శశిప్రియకి రెస్టులేకుండా పోయింది...."

"ఐసీ..." అన్నాడు డెంపో. శేఖర్ మాట్లాడుతున్నాడు. ఒకోసారి ఎదుటి వ్యక్తి మాటల్ని చెవులప్పగించి వినడం మంచిది.

"ఇండస్ట్రీలో చాలామంది శశిప్రియ కాల్‌షీట్స్ గురించి నాతో అన్నారు. ఉక్కిరిబిక్కిరిచేసే కాల్ షీట్స్‌వల్ల చిత్రం క్వాలిటీ దెబ్బతింటుంది. క్వాలిటీ దెబ్బతింటే మెయిన్ ఆర్టిస్టుల మార్కెట్ పడిపోతుంది; నిర్మాతలు ఆరిపోతారు గనక!"

"ఐసీ. .గంగాధర్ క్వాలిఫైడ్ డైరెక్టరని విన్నాను. అతనికి ఇది తెలీదా?" డెంపో ప్రశ్నించాడు.

"తెలుసు. బ్లూ ఫిల్మ్ ఆయన హృదయాన్ని గాయపరిచింది. దాన్ని ఆయన మరిచిపోలేరు. శశిప్రియ ప్రేమని గుర్తుంచుకోలేరు! ఆమెకీ తనకీ తీరికలేని వ్యాపకంవుంటే తప్ప మనశ్శాంతి వుండదన్న అభిప్రాయం ఆయనకి వున్నట్టుంది..."

"శేఖర్, శశిప్రియ డైరీని గంగాధర్ తీసేసుకున్నాక, నువ్వు ఎవరి డైరీ చూస్తున్నావు?" టెంపో ప్రశ్నించాడు.

శేఖర్ సోఫాలో ఇబ్బందిగా కదిలాడు. అర చేతుల్ని బోర్లించి పదిగోళ్ళనీ జాగ్రత్తగా పరీక్షించుకున్నాడు. మెల్లిగా తలెత్తి టెంపోవైపు చూశాడు. "శశిప్రియను నేనే పరిచయం చేశాను. ఆమెలోని మార్కెట్ వాల్యూని గుర్తించి, చిల్లర ఆర్టిస్టుల డైరీల్ని వదిలేశాను. ఇప్పుడు కొత్త నటీనటులకోసం గాలిస్తున్నాను. కొత్త వాళ్ళని పోటీలో ఇరికించడం అంత సులభంకాదు లెండి...."

డిటెక్టివ్ టెంపో క్షణకాలం యేదో ఆలోచిస్తూ కళ్ళు మూసుకొని, సోఫా వెనక్కి తలవాల్చాడు. కళ్ళు తెరిచి శేఖర్ ముహంలోకి తదేకంగా చూశాడు.

"టెంపోగారూ, నేను వెళ్తాను. గిరీశ్ ఆర్య గురించి శశిప్రియకు చెప్తాను...." శేఖర్ లేచే ప్రయత్నం చేస్తూ అన్నాడు.

"శేఖర్, శశిప్రియను నువ్వు ప్రేమించావ్!" టెంపో కంఠం గంభీరంగా ధ్వనించింది.

శేఖర్ ఉలిక్కిపడ్డాడు. అతని ముహం తెల్లబడడం ప్రారంభించింది. తనకి అర్థంకాని కొంకిణి భాషలో టెంపో ఏదో అన్నట్టు చూశాడతను.

"టెంపోగారూ.... మీది ప్రశ్నకాదు! తెలిసిన విషయం గురించి చెప్పినట్టు అన్నారు.... నేను...." శేఖర్ తడబడుతూ ఆగాడు.

"చాలా సేపట్నుంచీ నేను అడగని ప్రశ్నకి నీ కళ్ళు సమాధానం చెప్తున్నాయి. శశిప్రియ గురించి మాట్లాడిన ప్రతీసారీ నీ కళ్ళల్లో లీలగా ఆనందం, స్పష్టంగా బాధా

పెనవేసుకోడంలో విఫలమవుతున్న పాముల్లా అవుపిస్తున్నాయి శేఖర్!" డిటెక్టివ్ టెంపో గంభీరంగా అన్నాడు.

శేఖర్ ఓటమిని అంగీకరిస్తూ బరువుగా నిట్టూర్చాడు. "మిస్టర్ టెంపో, ప్రేమ విషయంలో అబద్ధాలాడకూడదు. ఆమెని....ప్రేమించాను....అదంతా గతం..."

"ఇంకా ప్రేమిస్తున్నావు. ఇదంతా వర్తమానం!" టెంపో నవ్వుతూ అన్నాడు.

శేఖర్ నిస్సహాయంగా, నీరసంగా చూశాడు. "టెంపోగారూ, మీదికాని తోటలోని గులాబీని మీరు దూరంనుంచి చూసి ఆనందించగలరు. అంతే! కోసి, కోటుకి గుచ్చుకోలేరు...."

డిటెక్టివ్ టెంపో అతన్ని చిరునవ్వుతో చూసాడు. "యూ ఆర్ రైట్. శేఖర్, మీ ప్రేమ గురించి గంగాధర్ కి తెలుసా?"

"మీ ప్రేమ అంటున్నారు. అది 'నా' ప్రేమ మాత్రమే! నేను చాలా స్లో మనిషిని. సకాలంలో నా ప్రేమ గురించి శశిప్రియకు వ్యక్తం చేయలేదు."

"అకాలంలో వ్యక్తం చేశావా?" టెంపో నవ్వుతూ ప్రశ్నించాడు.

శేఖర్ తల బలహీనంగా అటూ ఇటూ ఊగించి. "..లేదు. నేను సిద్ధమవుతూ వున్నప్పుడే గంగాధర్ గారూ, శశిప్రియా రాకెట్లో యెగిరిపోయారు! గిన్నెలు ఖాళీ అయ్యాక, నా ఆకలి గురించి చెప్పడం దండగ!"

టెంపో నవ్వుతూ చూశాడు. "శేఖర్, పెళ్ళయ్యేదాకా శశిప్రియ కన్యగానే వుందా?

శేఖర్ కంగారుగా చూశాడు. అతని పెదవులు కొద్దిగా అదిరాయి.

"నాకు.... నాకు.... తెలీదు...."

"శశిప్రియ నాకో పని అప్పగించింది. ఆ పని జయప్రదంగా పూర్తిచేయాలంటే నాకు ఎన్నో నిజాలూ, ఇంకెన్నో అబద్ధాలూ, నిజాల్లా ధ్వనించే అబద్ధాలూ అబద్ధాల్లా ధ్వనించే నిజాలూ కావాలి! నువ్వు నీకు తెలిసిన నిజాన్ని పూర్తిగా చెప్పడం లేదని నాకు తెలుసు, శేఖర్!" టెంపో గంభీరంగా అన్నాడు. అతని కళ్ళు సూర్యకాంతిలో తళుక్కుమనే కత్తి కొసల్లా మెరుస్తున్నాయి.

శేఖర్ కళ్ళు చిట్లించాడు. "మిస్టర్ టెంపో...."

"బ్లూ ఫిల్మ్‌ని ట్రేస్ చేయడానికి ఆమె నిన్ను పంపించింది. తనని స్పష్టంగా చూసిన వ్యక్తి కాకపోతే బ్రహ్మాండమైన నమ్మకం లేకపోతే ఆమె నిన్ను తన విశ్వరూపం వున్న డర్టీ ఫిల్మ్‌ని చూడ్డానికి పంపించేది కాదు!"

శేఖర్ కంగారుగా, అయోమయంగా చూశాడు. మెల్లిగా అతని పెదవులు కదిలాయి.

"పెళ్ళికిముందు, గంగాధరంతో ఆమె పరిచయం ముదరక ముందు ఒక సంఘటన జరిగింది.. ఆ రోజు రాత్రి పదిదాటాక శశిప్రియ ఇంటికి వెళ్ళాను. ఉదయం నుంచీ ఆమె ఆరోగ్యం బాగోలేదని నాకు తెలుసు. తలుపులన్నీ మూసి వున్నాయి. గొళ్ళేలు పెట్టలేదు. ఆమె గదిలోకి వెళ్ళాను. మంచంమీద దాదాపు అపస్మారక స్థితిలో ఆమె పడుకుంది. ఆమె శరీరం పూర్తిగా చెమటతో తడిసిపోయింది మొహంమీంచీ కారుతున్న చెమటతో తలగడ తడుస్తోంది. కంగారుగా ముట్టుకుని

చూశాను. ఆమె శరీరం కాలుతోంది.

"అప్రయత్నంగా ఆమె దుస్తుల్ని తొలగించాను. తడిగుడ్డతో ఆమె శరీరాన్ని పూర్తిగా, జాగ్రత్తగా తుడిచాను. డాక్టర్‌కి ఫోన్ చేశాను. ఇంజక్షన్స్ ఇచ్చాకనీ తడిగుడ్డని నుదురుమీద కప్పమనీ డాక్టర్ అన్నాడు. అలాగే చేశాను. తెల్లవారుఝాము దాకా, ఆమెకి దుప్పటి కప్పలేదు. చెలమలోంచీ నీరు ఊరుతున్నట్టు ఆమె శరీరం లోంచి చెమట ఊరుతూనే వుంది. అప్పటికే ఆమె నా ఆరాధ్య దేవత అయివుంది. రెప్పపాటు లేకుండా ఆమెను చూస్తూ అలాగే కూచుండిపోయాను. అరోజా, ఆ క్షణాల్లో నేను చూసిన ఆమె నగ్న సౌందర్యం నా మెదడుమీద పచ్చపొడవబడింది. ఆ అందాన్ని ఎన్ని జన్మలెత్తినా మరిచిపోలేను.." శేఖర్ ఆగి, నుదుర్ని కమ్మిన చెమటను తుడుచుకున్నాడు.

టెంపో అతన్ని చిరునవ్వుతో చూశాడు.

"కానీ, మిస్టర్ టెంపో, నాలో బ్రద్దలవుతున్న కోరికని ఆమె ఆ సహాయిస్థితి కంట్రోల్ చేసింది. మామూలు సమయంలో ఆమెని అలా చూసివుంటే నన్ను నా కోరికను కంట్రోల్ చేసుకునేవాణ్ని కానేమో! నిస్సహాయంగా, అప్పుడే పుట్టిన పాపాయిలా నాముందు వెల్లకిలా పడుకున్న శశిప్రియను.. నేను..అనుభవించలేదు! నన్ను నమ్మండి!"

"ఐ బిలీవ్ యూ, శేఖర్!" టెంపో క్లుప్తంగా అన్నాడు.

"పొద్దుటే తను గుడ్డలేకుండా పడుకున్న విషయం ఆమె గమనించి వుంటుంది. నేనే ఆమె గుడ్డల్ని తీసే శానని ఊహించి వుంటుంది. కానీ, శశిప్రియ నన్ను

అడగలేదు; నేను చెప్పలేదు. తనని నేను ఒకరాత్రంతా నగ్నంగా చూశానని తెలుసుకున్న ఆమె నన్ను ఫిల్మ్ సెటకి పంపివుండొచ్చు, మిష్టర్ టెంపో!" శేఖర్ సంజాయిషీ ఇస్తున్నట్టుగా అన్నాడు.

టెంపో నవ్వుతూ లేచాడు. "ఓకే. శేఖర్. వెళ్ళిరా. అవసరం అయితే ఫోన్ చేస్తాను. శశిప్రియ యేదో షూటింగ్ లో వుందనుకుంటా. ఆమెకి ఫోన్ చేయి. గిరీశ్ ఆర్య రాత్రికి ఇక్కడ వుండేలా చూడమను. ఆమె ఏం చేస్తుందో నాకు అనవసరం!"

తలాడిస్తూ శేఖర్ వెళ్ళిపోయాడు.

టెంపో కుర్చీలో కూచుని టెలిఫోన్ రిసీవర్ అందుకున్నాడు. ఆలోచిస్తూ సిగరెట్ వెలిగించాడు. తనలో యెన్నో సందేహాలున్నాయి. తన సందేహానికి సమాధానాలు—తడుముకోకుండా—ఇచ్చే వ్యక్తి 'గాసిప్ కాలమ్' ఎక్స్‌పర్టు చిన్నారావు ఒక్కడే. వెండితెర వెనక భాగోతాల్ని పాఠకులకి అమ్ముతూ, మేడలూ మిద్దెలూ కొంటూ నెట్టుకొస్తున్నాడు! టెంపో నవ్వుకుంటూ చిన్నారావు నంబరు డయల్ చేశాడు.

5

డిటెక్టివ్ టెంపో అతన్ని నవ్వుతూ చూశాడు. అతను నవ్వలేదు.

"మిష్టర్ టెంపో, అయామే బిజీమాన్. పదిహేను నిముషాలు మాత్రం మీకు స్పేర్ చేయగలను. విధిలేక శశిప్రియ మాటని కాదనలేక ముఖ్యమైన పనిని అసిస్టెంటుకి అప్పజెప్పి, పరుగెట్టుకొచ్చాను. వాట్ డూయూ వాంట్?" గిరీశ్ ఆర్య గబగబా అన్నాడు. అతని వాలకం అయిష్టతని స్పష్టంగా వ్యక్తంచేస్తోంది. రిమ్

లెన్ కళ్ళద్దాలు వెరిసిన గిరిజాల జుట్టు. కెమెరా లెన్స్ లాంటి కళ్ళు. టెంపో అతన్ని ఒకసారి ఎగాదిగా చూశాడు.

"నాకేం కావాలో శశిప్రియ...."

"చెప్పలేదు. అఘమేఘాలమీద వెళ్ళి మిమ్మల్ని కల్సుకొమ్మంది. ఏం కావాలో త్వరగా...."

"మిస్టర్ ఆర్యా, మీరు నాతో కనీసం గంటసేపు వుండాలి. వీల్లేదంటే ఇప్పుడే అఘమేఘాలమీదే వెళ్ళి పోడం మంచిది!" టెంపో నవ్వుతూ అన్నాడు. సోఫాలో కూచుని, తీరుబడిగా సిగరెట్ వెలిగించాడు.

గిరీశ్ ఆర్య ఆశ్చర్యంగా చూశాడు. భరతనాట్యం ప్రాక్టీస్ చేస్తున్నట్టు పాదాల్ని కదిలించాడు. "చాలా ముఖ్యమైన, తొందరపని అనీ, తన పనే అనుకోవాలనీ శశిప్రియ ప్రత్యేకంగా చెప్పింది" ఎటూ తేల్చుకో లేకుండా నసిగాడతను.

"శశిప్రియ ప్రత్యేకంగా చెప్పివుంటే తన పనే అని చెప్పివుంటే అది ఆమె తలనొప్పి. గిరీశ్ ఆర్య టైం స్పేర్ చేయలేనప్పుడు మరో నరేశ్ ఆర్యను ఆమె పంపాలి" టెంపో నిర్లక్ష్యంగా నవ్వాడు.

గిరీశ్ ఆర్య మొహంమీద ఏదో మాస్కుని ఎవరో పీకిపారేసినట్టయ్యింది. అప్రయత్నంగా అతను సోఫాలో కూలబడ్డాడు. కళ్ళద్దాల్ని తీసి టెంపోవైపు నవ్వుతూ తిరిగాడు. గుర్రం దిగేసిన గిరీశ్ ఆర్యని టెంపో చిరు నవ్వుతో చూశాడు.

"మిస్టర్ టెంపో, ఆల్ రైట్ గంట! చెప్పండి!" అన్నాడు గిరీశ్ ఆర్య.

"మిస్టర్ ఆర్యా, అద్దాలు పాలిష్ చేసి, తగిలించండి.

ఒక వీడియో కాసెట్ ప్లే చేసి చూపిస్తాను. అందులోని శశిప్రియ శశిప్రియ అవునో కాదో మీరు చెప్పాలి!" అంటూ టెంపో లేచి, టీవీ వైపు కదిలాడు. ఏదో అడగబోయిన గిరీశ్ ఆర్య, మనసు మార్చుకొని సిగార్ వెలిగించాడు.

"గుడ్ హెవెన్స్!" స్క్రీన్ మీద ప్రత్యక్షమైన శశిప్రియని చూసి ఆర్య ఆశ్చర్యంతో అరిచాడు.

"పూర్తిగా చూడండి. పూర్తిగా మీ కళ్ళని ఉపయోగించండి! పూర్తిగా అయ్యేదాకా నోరు ఉపయోగించకండి." అతని పక్కనే కూచుంటూ టెంపో అన్నాడు. ఆర్య అప్రయత్నంగా తలపంకిస్తూ చూపుల్ని స్క్రీన్ మీద నాటేశాడు.

* * *

గిరీశ్ ఆర్య ఆశ్చర్యం నిండిన కళ్ళతో డిటెక్టివ్ టెంపోని చూశాడు. మొహానికి పట్టిన చెమటని అరచేత్తో తుడుచుకున్నాడు.

"మై గాడ్ మిస్టర్ టెంపో, నా కళ్ళని నమ్మలేకుండా వున్నాను! ఈ డర్టీ థింగ్ ఎక్కడిది?"

టెంపో చిన్నగా నవ్వాడు. "అదంతా శశిప్రియ మీకు వివరిస్తుంది. ఫిల్మ్‌లోని ఆడది ఆమేనా?"

"అందుకు సందేహంలేదు! కాలిగోటినుంచీ తల వెంట్రుకలదాకా ఆమే!" ఆర్య ఉద్రేకంతో అన్నాడు.

"మిస్టర్ ఆర్యా, అది మీకెలా తెలుసు?" టెంపో నవ్వుతూ అడిగాడు.

గిరీశ్ ఆర్య అర్థంకానట్టు కళ్ళు చిట్లించాడు. మెల్లిగా అతని మొహంమీద చిరునవ్వు ప్రత్యక్షమైంది. "మీ సందేహం నాకు అర్థమైంది. ఆమెని ప్రత్యక్షంగా

నగ్నంగా చూపివుంటేగానీ, ఆ బొమ్మలో బొమ్మ ఆమె అవునో కాదో ఖచ్చితంగా చెప్పడానికి వీల్లేదు. పూర్తి నగ్నంగా కాకపోయినా, దాదాపు నగ్నంగా శశిని చాలాసార్లు చూశాను, కెమెరామన్‌గా. క్రేప్ పేపర్లాంటి చీర తగిలించి, అరగంట పాటు నీళ్ళల్లో యాక్ట్రెస్‌ని నానబెట్టి, ఏదో పాట సిచ్యుయేషన్‌లోనో స్నానఘట్టంలోనో చూపిస్తేగానీ సినిమా హిట్ కాదని నిర్మాతలూ, దర్శకులూ అనుకుంటారు. హీరోయిన్ నీళ్ళలో తడిసి ముద్దయిపోయి అవుపిస్తేకానీ సన్నివేశంలో 'ప్రేమ' లేదని ప్రేక్షకులు అనుకుంటారు!"

టెంపో నవ్వాడు. గిరీశ్ అర్ధ సిగార్ వెలిగించాడు. "శశి నటించిన పదిహేను చిత్రాలకి పైగా నేనే వర్క్ చేశాను. దాదాపు ప్రతీచిత్రంలోనూ ఆమెని నీళ్ళల్లో, ముంచి, ఇవతలికితీసి షూట్ చేశాం. 'సెన్సార్ కన్ను' పడకుండా వుంటే, తడిపిన ఉలిపిరికాయితంలో అడదాన్ని నగ్నంగా ఎలా చూపించవచ్చో మీకు—అంటే ప్రేక్షకులకి అర్థమయ్యేది! చెప్పొచ్చేదేమిటంటే, ఆ విధంగా శశిప్రియను దాదాపు నగ్నంగా చాలా చాలా సార్లు నేను చూశాను. ఆమె శరీరంలోని ఒక్కో భాగాన్నీ క్లోసప్ షాట్స్‌లో, లెన్స్‌గుండా చూశాను. చాలామంది తారల వివిధ అంగాలు విడివిడిగా నా కెమెరా కళ్ళకి బాగా పరిచయం వున్నాయి; ఒక్క జననాంగాలు తప్పించి!" గిరీశ్ నవ్వుతూ అన్నాడు.

"అయితే...." టెంపో యేదో అడగబోయాడు.

"ఇంకో 'సాక్ష్యం' కూడా మీకు చూపిస్తాను. శశిప్రియ మోకాలి మడతకింద అర్థరూపాయి సైజులో గోధుమరంగు మచ్చవుంది. దాన్ని చాలాసార్లు నేను

చూశాను. ఫిల్మ్‌లో ఆమె కాలు పైకెత్తినప్పుడు ఆ మచ్చ నాకు బాగా కనిపించింది! అంటే తల శశిదీ, క్రింద మరో పనిదీ అయ్యుండొచ్చన్న మీ ఆలోచనని మరిచిపొండి. ఫిల్మ్‌లో ఇంత సేపూ కసరత్తు చేసింది శశిప్రియే!" గిరీశ్ ఆర్య నిర్ధారణగా అన్నాడు.

టెంపో అతన్ని నవ్వుతూ చూశాడు. "ఆమె శశిప్రియ కాదేమో అన్న ఆశతో ప్రయత్నించాం. ఆల్‌రైట్....ఆ మచ్చని సృష్టించి...."

"మిస్టర్ టెంపో. ప్రామినెంట్‌గా, ఆకర్షణీయంగా అవుపించే శరీర భాగాల్లో ఏవైనా పుట్టుమచ్చలూ, గాయాల మచ్చలూ అవసరమైతే సృష్టించి డూప్‌ని పెట్టి ఇలాంటి ఫిల్మ్స్ తీస్తారు. మోకాలికింద వున్న పుట్టుమచ్చని డూప్‌కి సృష్టించేంత జాగ్రత్త ఎవ్వరూ తీసుకోరు. ఎందుకంటే చూసేవాళ్ళ దృష్టిని మోకాలి వెనక భాగం అంతగా ఆకర్షించదు. మోకాలి వెనకభాగం కనిపించేలా కాలు కదిలినపుడు ప్రేక్షకుల కళ్ళని లాగిపట్టే భాగాలు వేరే వుంటాయి!"

"మాటవరసకి అనుకుందాం: మీరు చూసిందాన్ని బట్టి బ్లూ ఫిల్మ్‌లో తల ఒకరిదీ. బాడీ ఒకరిదీ అయ్యే అవకాశం వుందా?" టెంపో ప్రశ్నించాడు.

"ఖచ్చితంగా లేదు!"

"టెక్నికల్‌గా చెప్పండి!"

గిరీశ్ ఆర్య తలాడించాడు. "మీరు అంటున్నవిధంగా ట్రిక్ ఫోటోగ్రఫీతో శశిప్రియ తలకి మరో ఆడశరీరాన్ని తగిలిస్తే, దాన్ని కనిపెట్టడానికి రెండు అవసరం. ఒకటి: శశిప్రియ అసలు శరీరంలో ప్రతి అంగుళంకూడా 'చూసే వ్యక్తి' ప్రత్యక్షంగా చూసి వుండాలి. అదికూడా ఒక

సారి చూస్తే చాలదు. ఆమె నగ్న శరీరంతో చాలా దగ్గరైన, చాలా కాలంగా వున్న ఇంటిమేట్ పరిచయం వుండాలి. మీ శరీరంతో మీకున్న పరిచయం కంటే ఎక్కువ పరిచయం అవసరం. ఎందుకంటే మీ శరీరంలో కొంత భాగంతో మీకు ప్రత్యక్ష పరిచయం వుండదు!

"రెండు: ఒకే శరీరంగా చూపించబడుతున్న బొమ్మలో రెండు శరీరాలు—ఒక తలా, ఒక మొంలా—వున్నాయని కనిపెట్టడానికి, కెమెరా ట్రిక్‌ని కనిపెట్టడానికి టెక్నికల్ ఐ, సాంకేతిక నేత్రం వుండాలి! నేను ఆ సాంకేతిక నేత్రాన్ని ఉపయోగించాను. నాలాంటి అనుభవజ్ఞుడైన వ్యక్తి కంటికి ఆ 'ట్రిక్ దొంగ' సులభంగా దొరికిపోతాడు! మనం చూసిన బొమ్మలో కెమెరా ట్రిక్ లేదని ఖచ్చితంగా, సగర్వంగా చెప్పగలను! అది ముమ్మూర్తులా శశిప్రియే! అయామ్ సారీ ఫర్ దట్ కిడ్!"

టెంపో సిగరెట్ వెలిగించి, నవ్వుతూ. "మిస్టర్ ఆర్యా, యూ ఆర్ రియల్లీ యాన్ ఎక్స్‌పర్ట్! మీరు వివరించిన అణువు అణువుతోటీ అతిదగ్గర పరిచయం. టెక్నికల్ దృష్టి రెండూ కాకుండా. అతి సాధారణమైన మరో 'ఆధారం'తో కూడా ఆ బొమ్మ శశిప్రియదో కాదో చెప్పొచ్చు! చెప్పమంటారా?"

గిరీశ్ ఆర్య గుబురు కనుబొమలు అతని నుదుర్ని ఎన్నో ముడతలుగా పైకి తోశాయి. "చెప్పండి.!"

డిటెక్టివ్ టెంపో అతన్ని తదేకంగా చూశాడు. "మీరు మీ మనవడిని ఎత్తుకుని లాలించి ముద్దెట్టుకోబోతారు. మీ వాత్సల్యం పొందట మీ హృదయం

లోంచీ కళ్ళల్లోకి చూసుకొస్తుంది. అంటే మీ కళ్ళు రియాక్టు అవుతాయి. మనవడి పాలబుగ్గని ముద్దెట్టుకోడానికి మీ పెదవులు సున్నితంగా కదుల్తూ రియాక్టు అవుతాయి. మనవడిని పట్టుకున్న మీ చేతులు వాత్సల్యభారంతో రియాక్టు అవుతాయి. పాపడిని మీ దగ్గరగా ప్రేమగా లాగుతాయి. మీ హృదయంలోని వాత్సల్యం కళ్ళల్లోకీ, పెదవుల్లోకీ, చేతుల్లోకీ ప్రవహిస్తుంది. మీరు మనవడిని ముద్దెట్టుకుంటారు. అంటే మీ హృదయంలోని కోరికకి అనుగుణంగా కళ్లూ, పెదవులూ, చేతులూ ప్రవర్తించాయన్నమాట. మీ కళ్ళల్లో, మొహంలో ప్రత్యక్షమైన మీ వాత్సల్యం మీ చేతుల్లో పెదవుల్లో వ్యక్తమై నాకు స్పష్టంగా కనిపించిందన్నమాట!"

"చెప్పండి!" గిరీశ్ ఆర్య మెరిసే కళ్ళతో అన్నాడు.

"శశిప్రియ బ్లూ ఫిల్మ్‌ని తీసుకుందాం. ఆ వ్యక్తి ఆమెని అనుభవిస్తున్న సమయంలో చాలాసార్లు ఆమె మొహంలోని భావాలకి అనుగుణంగా ఆమె శరీరావయవాలు స్పందించాయి; కదిలాయి. ఉదాహరణకి ఒక షాట్‌లో ఆమె 'అతని' కళ్ళల్లోకి చిలిపిగా చూసింది. ఆ క్షణంలో ఆమె కుడిచేతి వేళ్ళు అతని వీపుమీద గిల్లాయి. మరోసారి వాళ్ళ పెదవులు అతుక్కుపోయాయి. ఆమె చేతులు అతని మెడచుట్టూ బిగుసుకుపోయాయి. క్లైమాక్స్ ముందు ఆమె తల ఆవేశంతో అటూ ఇటూ కదిలింది. అదే భావాన్ని ఆమె కాళ్లూ, చేతులూ స్పష్టంగా, నాచురల్‌గా ప్రకటించాయి...."

"యూ ఆర్ రైట్! కానీ...."

"మిష్టర్ ఆర్యా, మీరు కళ్ల తో నవ్వుతున్నప్పుడు, మీ కళ్ళలోని భావాన్ని నా చేతుల్తో నేను ప్రకటించ

లేను. మీరు కోపంతో పళ్ళు కొరుక్కుంటూ రౌద్రంగా చూస్తే నా చేతులు ఖచ్చితంగా రియాక్ట్ అయి, పిడికిళ్ళుగా బిగుసుకోడం అంత సులభంకాదు! నటనవేరు. పర్ఫెక్షన్ వేరు! ఒక్క ముక్కలో చెప్పాలంటే మనస్సూ శరీరం—ఈ రెండింటి సమన్వయం. కోఆర్డినేషన్ ఆఫ్ మైండ్ అండ్ బాడీ!"

గిరీశ్ ఆర్య తల ఆవేశంతో ముందుకీ వెనక్కీ ఊగింది.

"ఈ లక్షణం, 'కోఆర్డినేషన్ ఆఫ్ మైండ్ అండ్ బాడీ' శశిప్రియలో చాలా నాచురల్ గా, పర్ఫెక్ట్ గా వుంది! అంటే, ఈ బ్లూ ఫిల్మ్ లోని స్త్రీ ఆమే!"

"మిస్టర్ టెంపో, మీ రీజనింగ్ అద్భుతం! మతిపోగొట్టేశారు! నన్ను యెంతో ఎడ్యుకేట్ చేశారు! యూ ఆర్ జీనియస్!" గిరీశ్ ఆర్య ఉద్రేకంతో అరిచాడు.

"ఈ రీజనింగ్, శశిప్రియ బ్లూ ఫిల్మ్ లో సాక్షాత్తుగా వుందని నిరూపిస్తోంది. అదే అసలు దురదృష్టం!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"మిస్టర్ టెంపో...."

"అది శశిప్రియ ఫిలింకాదని నిరూపించాలి!" టెంపో నవ్వుతూ అన్నాడు.

గిరీశ్ ఆర్య అర్థమైనట్టు తలాడించాడు. ఏదో అలోచన తట్టి టెంపోవైపు సూటిగా చూశాడు. "మీరు వివరించాక నాకు అంతా అర్థమైంది. మొహంలోని భావాలకి అనుగుణంగా, డూప్ గా వాడబడిన ఆడదాని శరీరం రియాక్షన్ వుండాలని బ్లూ ఫిలిమ్స్ తీసేవాడు అనుకోడు. వాళ్ళకి కావాల్సింది రియాక్షన్ కాదు! యాక్షన్! ఒక ఆడదాని శరీరాన్ని వీలైనంత దారుణంగా

చూపాలి. ఒక మగాడి శరీరాన్ని అలాగే చూపాలి. ఒక ఆడదాని శరీరం, ఒక మగాడి శరీరం రెండూ ఒకటయ్యే నాటకాన్ని మొరటుగా చూపాలి! అంతే! 'కోఆర్డినేషన్ ఆఫ్ మైండ్ బాడీ' బూతు ఫిల్ములకి అవసరంలేదు అంత శ్రమ తీసుకోరు?"

"యూ ఆర్ రైట్!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"మిస్టర్ టెంపో. ఆ బూతులోని 'ఆబోతు' ఎవడు?" గిరీశ్ ఆర్య తకీముని ప్రశ్నించాడు.

"అతనెవరో తెలిస్తే అంతా అయిపోయినట్టే! ప్రొఫెషనల్ బ్లూ ఫిల్మ్ ఆర్టిస్టేమో అని ప్రయత్నించాను. ఇంతవరకూ అతన్ని యెవరూ యే ఫిల్ములోనూ చూడలేదు....మిస్టర్ ఆర్యా, ఈ ఫిల్మ్‌లో బ్యాక్‌గ్రౌండ్ ఏమీ లేదు. మంచం, రెండు శరీరాలూ తప్ప మరేం లేదు. యే గోడో, కిటికీయో యేదో వొకటి వుండాలి! యేమీ లేకుండా తీసివుండొచ్చా, చేసి వుండొచ్చా?" టెంపో సాలోచనగా అడిగాడు.

"యస్. అది నేనూ గమనించాను. బ్యాక్‌గ్రౌండ్ యేదివున్నా అది చాకచక్యంగా ఎరేస్ చేయబడింది!" గిరీశ్ ఆర్య జవాబిచ్చాడు. "ఎరేస్ చేసి, రీ షూట్ చేయొచ్చు!"

తలపంకిస్తూ టెంపో లేచి నిలుచున్నాడు. అతన్ని చిరునవ్వుతో చూశాడు.

"మిస్టర్ ఆర్యా. థాంక్యూ వెరీమచ్! నా పరిశోధనకి యెంతో సహకరించారు...."

గిరీశ్ ఆర్య నిలబడి, అదోలా చూశాడు. "మిస్టర్ టెంపో, నా సహాయం అనుకున్న విధంగా శశికి ఉపయోగించలేదు. బొమ్మలోని శశి శశికాదు అని తేల్చే అత

కాశం లేకపోయింది. నిజాన్ని అంగీకరించక తప్పదు.... అయాం....సారీ...."

"అది నిజమైతే నిజంకాని 'అది' యేదో వుండి తీరాలి!" టెంపో గంభీరంగా అన్నాడు.

"అరంకాలేదు...."

"మిష్టర్ ఆర్యా, శశిప్రియా, శేఖర్ — ఇద్దరూ నాతో మాట్లాడారు. ఇద్దర్లో ఎవరో అబద్ధమాడుతున్నారు! ఎవరో, ఏమిటో, ఎందుకో తెలిస్తేగాని ఈ మిస్టరీ విడిపోదు!"

గిరీశ్ ఆర్య తలపంకించాడు. "మిష్టర్ టెంపో దీని మూలంగా శశి వివాహం బెడిసికొట్టేస్తుందనుకుంటాను.... గంగాధర్ మునుపట్లా అక్కడా, ఇక్కడా అవుపించడంలేదు....షీ ఈజ్ గుడ్ కిడ్....అయితే....ఎవరికెరుకలెండి! ఆల్ రైట్....వస్తాను. అవసరమైతే కబురు చేస్తే, మళ్ళీ వస్తాను...."

టెంపో నవ్వుతూ అతనితో కరచాలనం చేశాడు....

6

వరండామీద నిలబడి, డిటెక్టివ్ టెంపో కాలింగ్ బెల్ బటన్ కోసం చూశాడు. సిగరెట్ ని పెదాలమధ్య ఇరికించి తలుపుమీద వేళ్ళతో చప్పుడు చేశాడు. లోపల్నుంచి లీలగా వినిపిస్తున్న మాటల్ని నిశ్శబ్దం మింగేసింది. కొంచెం ఆలస్యంగా తలుపు తెరుచుకుంది.

తలుపు తెరిచిన శేఖర్ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేశాడు. "టెంపోగారా, మీరా! రండి రండి...." అంటూ అతను తలుపుల్ని బార్లా తెరిచాడు. అతని కంఠధ్వనితో అతని కళ్ళూ, మొహం ఏకీభవించడంలేదని టెంపో గుర్తించాడు. కోఆర్డినేషన్ ఆఫ్ మైండ్ అండ్

బాడీ! టెంపో నవ్వుతుంటూ లోపలికి అడుగువేశాడు.

సోఫాలోంచీ చివాల్న లేచిన యువతి టెంపో దృష్టిని ఆకర్షించింది. పల్చటి తెల్లచీర. ముదురు నీలం రంగు స్లీవ్ లెస్ జాకెట్. చెవులకి బైరాగులు వేసుకునే పైజూ రింగులు. నాలుగైదు కోటింగ్స్‌తో కోల ముఖానికి అతుక్కున్న మేకప్. సన్నటి పొడుగాటి ఆకారం. పచ్చటి మేఘాల్ని పైకి తోసేస్తున్న జంట పర్వత శిఖరాల్లా అవుపిస్తూ పైటనితో స్తున్న నీలంరంగు జాకెట్. అందాన్ని దాచుకోడంకన్నా, ప్రదర్శించడమే ఆమె వస్త్రధారణలోని ఉద్దేశంగా వుంది.

టెంపో తన చూపుల్ని ఆమెమీంచీ శేఖర్ మీదికి తిప్పాడు. శేఖర్ ఇబ్బందిగా ఆమెని చూశాడు.

"కోలా, రేప్పొద్దుట కల్సుకుందాం...." అన్నాడతను మెల్లిగా.

నిరుత్సాహంగా చూస్తూ ఏదో చెప్పబోయిన కోలా మనసు మార్చుకుని సోఫామీద పడున్న పర్సుని అందుకుని, అయిష్టంగా గుమ్మంవేపు కదిలింది. అలల్లా కదుల్తున్న ఆమె వెనక భాగం కాసేపట్లో గుమ్మంలోంచీ అదృశ్యమైంది.

"టెంపోగారూ, ప్లీస్ సిడౌన్...." శేఖర్ సోఫా చూపిస్తూ అన్నాడు.

టెంపో కూచున్నాడు. నవ్వుతూ అతన్ని చూశాడు. "కోలా! గమ్మత్తైన పేరు...."

శేఖర్ నవ్వాడు. "సినిమా ప్రపంచంలోకి అడుగెట్టగానే మనుషులు మారిపోయినట్టు పేర్లూ మారిపోతాయి! ఆమె పేరు కోలాటం లావణ్య. మావాళ్ళు ఎడిట్ చేసి 'కోలా' అన్నారు. గమ్మత్తేమిటంటే ఇలాంటి పేర్ల

త్వరగా క్లిక్ అవుతాయి...."

"క్లాత్ టాలెంటా?" టెంపో అడ్డు తగిలాడు.

"దాదాపుగా.... టెంపోగారూ. మీరొచ్చి చాలా సేపైందా?" శేఖర్ సందేహిస్తూ అడిగాడు.

టెంపో వెంటనే సమాధానం చెప్పలేదు. యాష్ట్రే కోసం చూసి, మెల్లిగా పైకి లేచాడు. ఇంకా సగం కూడా కాలని సిగరెట్‌ని వేళ్ళతో పట్టుకుని, కిటికీవైపు కదిలాడు. శేఖర్ ప్రశ్న అతనిలో ఆలోచనల్ని రేపుతోంది. తలుపు తట్టిన వ్యక్తిని 'వచ్చి చాలా సేపైందా?' అని తలుపు తెరిచిన వాళ్ళు సాధారణంగా ప్రశ్నించరు. సిగరెట్‌ని కిటికీలోంచీ గువ్వి మరో సిగరెట్ వెలిగించి, టెంపో సోఫావైపు కదిలాడు.

"వరండాలో నిలబడి పదినిమిషాలు తోటలోని మొక్కల్ని చూస్తూ వుండిపోయాను...." ఆలోచిస్తూ అబద్ధం ఆడాడు టెంపో. ఒకోసారి అబద్ధం నిజాన్ని ఇవతలికి లాగుతుంది.

శేఖర్ బరువుగా నిట్టూర్చి, సర్దుకున్నాడు. "టెంపోగారూ....శ్రమ తీసుకుని వచ్చారు...." అంటూ ఆగాడు.

"శేఖర్, కొన్ని విషయాలు అడగడం మరిచిపోయాను. పారిస్‌లో ఓడియన్ థియేటర్‌కి ఆ క్యాసెట్‌ని ఎవరు సప్లై చేశారు?"

"అడిగాను. బ్లూ ఫిల్మ్ సోర్స్‌ని ఎవ్వరూ ఎవ్వరికీ చెప్పరు!" శేఖర్ నవ్వాడు.

"ఆఫ్‌కోర్స్.... శశిప్రియ ఫిల్మ్‌లోని ఆ వ్యక్తి మరేదేనా ఫిల్మ్‌లో సీన్ కనిపించాడా? నువ్వు అసంఖ్యాకంగా అన్నిచోట్లా బ్లూ ఫిల్మ్స్ చూసినట్టు శశిప్రియ చెప్పింది...."

"అసలు ఫిల్మ్ దొరికాక, అంత ఆత్రుత లేకపోయినా పారిస్‌లో అయిదురోజులుండి బోల్డన్ని బ్లూలు చూశాను. కాపీలకోసమే అయినా, ఆ వ్యక్తి వున్న ఇతర చిత్రాల కోసం నాచురల్‌గా చూశాను. శశిప్రియ ఫిల్మ్ దొరక్క-ముందు చూసిన వాటిలోకూడా ఆ మొహం నాకు అవుపించలేదు. అతను కనిపించిన ఒకే ఒక చిత్రం ఇదే!" శేఖర్ జవాబిచ్చాడు.

టెంపో తలాడించాడు. "రాత్రి గిరీశ్ ఆర్య ఫిల్మ్‌ని చూశారు. ఆమె పూర్తిగా శశిప్రియే అంటూ కుండ బద్దలుకొట్టి చెప్పాడు...."

"గిరీశ్ ఆర్య రాత్రి నాకు ఫోన్ చేసి ఆ సంగతి చెప్పాడు...." అంటూ శేఖర్ కాసేపు తటపటాయిస్తూ చూశాడు. "మిష్టర్ టెంపో నేను నిజం చెప్పలేదని మీరన్నారట.... ఆయామ్ సారీ.... అబద్ధాలాడాల్సిన అవసరం నాకు లేదు!"

"అబద్ధాలాడకపోవడం వేరు, నిజం చెప్పకపోవడం వేరు శేఖర్!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"నాకు తెలిసిన నిజాలన్నీ మీకు చెప్పాను?" శేఖర్ ఉద్రేకంతో అన్నాడు.

టెంపో చిరునవ్వు నవ్వాడు. "అది త్వరలో తేలుతుంది. ఇట్సాల్ రైట్.... శేఖర్, మిస్ కోలా డెరీని చూడబోతున్నావా?" టెంపో అతని కళ్లలోకి సూటిగా చూస్తూ ప్రశ్నించాడు.

అసలు విషయంతో సంబంధంలేని టెంపో ప్రశ్న శేఖర్‌ని ఆశ్చర్యంతో నింపిందని అతని కళ్ళు చెప్తున్నాయి. క్షణకాలం తటపటాయించి అతను గొంతు సవరించుకున్నాడు.

"టెంపో గారూ....గుమ్మంముందు నించున్న మీరు ఎంతో కొంత వినేవుంటారు! నేను అబద్ధాలాడతానేమో అన్న అనుమానంతో, నన్ను పరీక్షించడానికి మీరీ ప్రశ్న అడుగుతున్నారని నాకు తెలుసు! కోలా నా సిఫార్సుకోసం వచ్చింది...." అంటూ ఆగాడు శేఖర్.

లోపల్లోపలే నవ్వుకుంటూ టెంపో మౌనంగా చూశాడు.

"గంగాధర్ త్వరలో ఒక కమర్షియల్ చిత్రం డైరెక్టు చేయబోతున్నారు. ఆ పిక్చర్లో తనకి హీరోయిన్ ఛాన్సు ఇప్పించమని కోలా నా ప్రాణాలు తీస్తోంది. అంతే!"

"నిర్మాత ఎవరు?" డిటెక్టివ్ టెంపో ప్రశ్నించాడు. గంగాధర్‌కి మళ్ళీ డైరెక్షన్ ఛాన్సొచ్చిందని శశిప్రియ చెప్పలేదు.

"నిర్మాత గంగాధరే."

టెంపో ఆశ్చర్యంగా చూశాడు. "అంటే శశిప్రియ సొంత చిత్రం అన్నమాట."

"గంగాధర్ చిత్రమే అనుకుంటా. ఎందుకంటే, ఆ పిక్చర్లో శశిప్రియ నటించదనుకుంటాను. 'రామ్ తేరీ గంగా మైలీ'లో రాజ్‌కపూర్ మందాకినిని టాప్‌లెస్‌గా చూపించినట్టు మరో తారని ప్రెజెంట్ చేయాలని గంగాధర్ అనుకుంటున్నారు. నిజం చెప్పాలంటే రాజ్‌కపూర్ కన్నా ధైర్యంగా, చొరవగా వ్యవహరించాలని ఆయన అనుకుంటున్నట్టు తెలిసింది."

"శేఖర్, గంగాధర్ ఆర్టుఫిల్ముతో దాదాపు తెర వెనక్కి వెళ్ళిపోయినట్టే అని విన్నాను. అతనికి డబ్బె

క్కడివి?" డిటెక్టివ్ టెంపో అడ్డొస్తూ ప్రశ్నించాడు.

శేఖర్ చిరునవ్వు నవ్వాడు. "మీకు తెలీదా? శశి ప్రియ డైరీని చూస్తున్నట్టే ఆయన ఆమె బ్యాంక్ అకౌంట్స్‌నీ, కలెక్షన్స్‌నీ చూస్తున్నారు. కలెక్షన్స్ అంటే అకౌంట్స్‌లోకి ఎక్కని మొత్తాలు!"

టెంపో కళ్ళు చిట్లిస్తూ చూశాడు. "ఇప్పుడు కూడా ఫైనాన్స్‌ని అతనే కంట్రోల్ చేస్తున్నాడా?"

"ఆ. ఆ విషయంలో శశిప్రియకి ఏమీ అభ్యంతరం లేదు. శశి ఆయన్ని హృదయంతో ప్రేమిస్తోంది" శేఖర్ జవాబిచ్చాడు.

"శేఖర్, గంగాధర్‌తో నీకు మంచి స్నేహం వుందా?" టెంపో అడిగాడు.

"పరిచయం వుంది. అది స్నేహంగా మారేలోగా ఆయన శశిప్రియ భర్త అయిపోయారు!"

"అయితే అతను ఇంకా అనౌన్స్ చేయని చిత్రం గురించి నీకెలా తెలుసు?"

శేఖర్ అదోలా నవ్వాడు. "గుమ్మంముందు నిలబడి మీరు దాదాపుగా వినేవుండాలి! శోలా చెప్పింది."

"ఆమె కెలా తెలుసు?"

"గంగాధర్ గారు ... చెప్పివుండాలి...." శేఖర్ అనుమానిస్తూ అన్నాడు.

"శోలా గంగాధర్ ఫ్రెండా?"

శేఖర్ వెంటనే మాట్లాడలేదు. అరచేత్తో నుదుర్ని తుడుచుకున్నాడు. "మిష్టర్ టెంపో, శశిప్రియ మీకు చెప్పివుండాలి.... గంగాధర్ గార్ని .... ఆ బ్లూఫిల్మ్ ఆమెకి శారీరకంగా దూరం చేసింది. మానసికంగా కూడా దూరం కాలేక ఇద్దరూ నరకయాతన పడుతున్నారు. బూ

ఫిల్మ్ గంగాధర్‌లోని బలహీన మానవుడిని నిద్రలేపి నట్టుంది. ఆయన తాగుతున్నారు. ఇంట్లోనే ఎవరెవరో అమ్మాయిల్ని....కలుసుకుంటున్నారు...."

టెంపో అతిప్రయత్నంమీద తన ఆశ్చర్యాన్ని దాచి పెట్టుకున్నాడు. తల పంకించి, సిగరెట్ వెలిగించాడు.

"అఫ్‌కోర్స్, ఇదంతా శశిప్రియకు తెలుసు. తను ప్రేమించిన భర్త తన దగ్గరే వున్నంతకాలం అతను తాగినా, అమ్మాయిలతో తన ఇంట్లోనే తైతక్కలాడినా ఆమెకి అభ్యంతరంలేదు. ఆమెలో ఒకరంగా గిల్టీ కాన్షస్ ప్రవేశించింది. తన అమాయకత్వాన్ని—బ్లూ ఫిల్మ్ విషయంలో—నిరూపించుకునేదాకా భర్త తనని గౌరవించలేడని ఆమె నిశ్చయించుకుంది! నిజం నిరూపించబడ్డాక తన భర్త తప్పకుండా తనవాడవుతాడు! గంగాధర్ గారు తనని వదిలివెళ్ళిపోయి తద్వారా చిత్ర రంగంలో, అభిమానుల్లో తనకి అపకీర్తి రావడంకూడా ఆమెకి ఇష్టంలేదు. భర్త ఆ బ్లూ ఫిల్మ్‌ని మరిచిపోయి, యధాప్రకారం తనని చూసుకోడానికి, అవసరమైతే చిత్రపరిశ్రమకి గుడ్‌బై చెప్పడానిక్కూడా ఆమె తయారుగా వుంది!"

"ఇదంతా నీకెలా తెలుసు?" టెంపో ప్రశ్నించాడు.

"శశిప్రియ చెప్పింది."

"ఆల్‌రైట్..అయితే, గంగాధర్ని కోలా తరచుగా కలుసుకుంటూ వుంటుందా?"

"వారంలో కనీసం అయిదు రాత్రులు కోలా ఆయనతో గడుపుతోంది!" శేఖర్ నవ్వుతూ అన్నాడు.

డిటెక్టివ్ టెంపో లేచాడు. "శేఖర్, శశిప్రియను కలుసుకోవాలి. ఆమె ఎక్కడుంది?"

"'అరణ్యపర్వం' షూటింగ్ లో, తిరుపతి సమీపం లోని తలకోనలో వుంది. రేపో, ఎల్లుండో రావొచ్చు" అంటూ శేఖర్ లేచాడు. "కూచోండి. టీ తయారు చేస్తాను."

"నో థాంక్స్. మరోసారి. ఇంతసేపూ మాట్లాడి నందుకు థాంక్స్!" అంటూ టెంపో కదిలాడు.

శేఖర్ అతన్ని గుమ్మందాకా సాగనంపాడు. తలుపు మూసుకుంది. చిన్న తోట దాటి టెంపో రోడ్డుమీదికి వెళ్ళాడు. అతనిలో యెన్నో తలాతోకాలేని ఆలోచనలు సాగుతున్నాయి. ఏదో కొత్త ఆలోచన అతని పాదాల్ని రోడ్డుకి తాపడం చేసింది. సిగరెట్ పొగ ఊదుతూ వెనక్కి తిరిగాడు. అతని కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి.

శేఖర్ ఇంటి ఎడంవైపునుంచీ, వరండామీదికి ఎక్కు తోంది కోలా....

7

"నువ్వేనా?" డిటెక్టివ్ టెంపో నవ్వుతూ అన్నాడు.

"సాక్షాత్తుగా!" క్రైమ్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నవ్వుతూ అన్నాడు.

"ఇప్పుడు 'మనిషి'గా అవుపిస్తున్నావ్!"

ఇన్‌స్పెక్టర్. పృథ్వీరావ్ ఆశ్చర్యంతో నోరు తెరి చాడు. "వాడ్డూయూ మీన్?"

టెంపో చిన్నగా నవ్వాడు. "బ్రౌన్ కలర్ సూటూ వైట్ షర్టు, చక్కగా మ్యాచ్ అవుతున్న నెక్ టై. వంకీలు తిరిగిన క్రాపూ. మామూలు మనిషి నవ్వే చిరు నవ్వూ. కమిన్, అద్దంలో చూసుకో. ఒక 'హ్యూమన్ బీయింగ్' నీకు కనిపిస్తాడు!"

పృధ్వీరావ్ పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

"అంటే, యూనిఫామ్‌లో వుంటే మనిషిలా అవుపించ నక్కెర్లేదనా నీ అర్థం?"

"పృథ్వీ. బ్రహ్మాండంగా కనిపెట్టావ్! అది నా అర్థమే కాదు; ప్రజలందరిదీ అదే అర్థం!" టెంపో నవ్వుతూ తలుపు మూసి, కదిలాడు. పృథ్వీరావ్ నిట్టూర్చాడు.

"పోలీసుల్ని మనుషులుగా చూసినప్పుడే లోకం బాగుపడుతుంది!" అన్నాడు నవ్వుతూ.

ఫ్లాస్కులోని టీని కప్పుల్లో పోసి టెంపో సోఫాలో కూచున్నాడు. "మనుషుల్లా కనిపించాలిగా?"

"టెంపో, ఇంకాస్సేపు ఇలాగే మాట్లాడితే, అలిగి వెళ్ళిపోతాను. అరగంటలో యూనిఫామ్‌తో వచ్చేస్తాను!"

టెంపో పకపకా నవ్వాడు. "ఆల్ రైట్! ఏమిటి కథ, పెళ్ళికొడుకులా తయారయ్యావ్?"

"అలా అడిగావ్, బావుంది. మా.... యానివర్సరీ."

టెంపో కళ్ళు చిట్లించాడు. "రెండువారాల కిందటేగా వెడ్డింగ్ యానివర్సరీ విందిచ్చారు శిరీషా, నువ్వూ?"

"అది వెడ్డింగ్ డే. ఇది 'లవ్ అట్ ఫస్టు సైట్ డే!' " పృథ్వీరావ్ నవ్వుతూ అన్నాడు.

"ఫస్టు కిస్ డే అన్నమాట!" టెంపో నవ్వాడు.

"నో.... అది వేరేవుంది. ప్రతీ నెలలో ఏదో ఒక డే పేరుపెట్టి నీ సిస్టర్ నన్ను నంజుకు తినేస్తోంది! ఆల్ రైట్ .... ఏమిటి కథ?"

టెంపో సిగరెట్ వెలిగించి, పాకెట్‌ని పృథ్వీరావ్ వొడిలో పడేలా విసిరాడు.

"పృథ్వీరావ్, నీకో నీలివార్త చెప్తాను?"

"సీలివాత్తా?" పృథ్వీరావ్, సిగరెట్ చుట్టూ పిడికిలి బిగిస్తూ అన్నాడు.

"యస్ 'బ్లూ' న్యూస్. అనగనగా ఒక తార. ఆరుకోట్ల ఆంధ్రులకీ ప్రియమైన ఆ తార పేరు శశిప్రియ" టెంపో ప్రారంభించాడు. కథ పెరిగేకొద్దీ పృథ్వీరావ్ సోఫా అంచుకి జరగసాగేడు.

"ఇంటరెస్టింగ్!" అంతా విన్న పృథ్వీరావ్ క్లుప్తంగా అన్నాడు.

"తను ఎప్పుడూ, ఎవరితోనూ అలా ప్రవర్తించ లేదంటుంది శశిప్రియ. ఈ బ్లూ ఫిలింమీద ఆమె జీవితం ఆధారపడుంది. అందరూ నిజమే చెప్తున్నారు. అబద్ధమేదో, అసలు నిజమేదో తేలడంలేదు!"

"గురూ, టేక్ మై అడ్వైజ్. ఈసారి నీకు దొరికిన వాళ్ళంతా సినిమాతాలీంలు. నటించకుండా మాట్లాడం, నటించకుండా వుండడం వాళ్ళకి చేతకాదు! ఈ మిస్టరీని నువ్వు ఛేదించలేవు. ఎందుకంటే ఇందులో మిస్టరీ లేదు!" పృథ్వీరావ్ నవ్వుతూ అన్నాడు.

"పృథ్వీరావ్!"

"నీ హీరోయిన్ పప్పులో కాలేసింది. ఎక్కడో, ఎప్పుడో, ఎందుకో బురద తొక్కింది. ఇప్పుడు కంపు కొడుతున్న ఆ బురదని కడుక్కోలేక తెంబేలెత్తిపోయి, యేదో ఒక మేకు సంపాదించి, ఆ బ్లూ ఫిల్మ్‌ని తగిలిస్తా నన్న నమ్మకంతో నీ దగ్గరకొచ్చింది. నిజాన్ని నిజంగా నిరూపించే శక్తి వున్న డిటెక్టివ్ టెంపో, నిజాన్ని అబద్ధంగా, అవసరమైతే అబద్ధాన్ని నిజంగా నిరూపించ గలడని ఊహించి నిన్ను పట్టింది!"

ఆలోచనల్ని పుట్టిస్తున్న పృథ్వీరావ్ మాటలు

టెంపోని సోఫాలోంచీ పైకి లేపాయి. అప్రయత్నంగా పచార్లు ప్రారంభించాడతను. అతన్ని చిరునవ్వుతో చూస్తూ ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ మరో సిగరెట్ వెలిగించి, పిడికిలి బిగించి పొయ్యి ఊదే గొట్టంలా చెప్పాడు చేస్తూ దమ్ములాగాడు.

ఉన్నట్టుండి కాలింగ్ బెల్ మోగింది. టెంపో ఆగి పృథ్వీరావ్‌ని అదోలా చూశాడు. చెమట కమ్మిన నుదుర్ని అరచేత్తో అలసటగా అద్దుకున్నాడు.

“పృథ్వీరావ్, ఎక్స్‌పర్ట్ కెమిరామన్ గిరీశ్ ఆర్య వచ్చినట్టున్నాడు. అతనితో బాటు నువ్వు వీడియో చూడు. తరవాత బుర్రలు బద్దలు కొట్టుకుందాం!”

“తప్పకుండా. ఇవాళ ఎలాగా పండగ. ఐవిల్ సెలిబ్రేట్ విత్ ఏ బ్లూ ఫిల్మ్!” పృథ్వీరావ్ నవ్వుతూ అన్నాడు. టెంపో గుమ్మంవైపు కదిలాడు.

* * *

గిరీశ్ ఆర్య డిటెక్టివ్ టెంపోని ప్రశ్నార్థకంగా చూశాడు. అతని నుదురు గీతలుగా మారింది. కళ్లల్లో, మొహంలో విసుకు స్పష్టంగా గోచరిస్తోంది.

“మిస్టర్ టెంపో, ఎన్నిసార్లు చూసినా, రంభ ఊర్వశికాదు. రంభ రంభే! మళ్ళా ఈ చెత్తని ఎందుకు చూశాం?”

పృథ్వీరావ్ పకపక నవ్వాడు. గిరీశ్ ఆర్య అతనివైపు ఉషారుగా చూస్తూ తన విసుగుని మరిచిపోయి నవ్వడం ప్రారంభించాడు. డిటెక్టివ్ టెంపో లేచి. వాళ్ళ ఎదురుగా నించున్నాడు. సిగరెట్ ముట్టించి, ఇద్దర్నీ తదేకంగా చూశాడు.

“పెళ్ళయ్యాక శశిప్రియ దంపతులు ఎక్కడెక్కడ

ఏకాంతం అనుభవించాలో, ఏ మీరు ఏకాంతంలో అనుభవించాలో శశిప్రియను అడిగి కనుక్కున్నాను. హనీమూన్ కి ఫారిన్ వెళ్ళేదాకా వాళ్ళు ఇంట్లోని పడగ్గదిలోనే కలుసుకున్నారు. ఆమె షూటింగ్ సందర్భంలో రెండుసార్లు ఆమె హైదరాబాద్ వెళ్ళింది. రెండుసార్లు గంగాధర్ ఆమెతో హైదరాబాద్ వెళ్ళాడు. హోటల్ గోల్కొండలో బసచేసారు...."

"టెంపో....ఇదంతా ఎందుకు చెప్తున్నావో అర్థం కావడంలేదు!" ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ అడ్డుతగిలాడు. ఔనన్నట్లు చూస్తూ ఆర్య సిగార్ వెలిగించాడు.

డిటెక్టివ్ టెంపో రెప్పవేయకుండా పృథ్వీరావ్ ని చూస్తూ వుండిపోయాడు. ఔను....తనేమిటి మాట్లాడుతున్నాడు? ఎందుకు? ఎందుకు? అతని మెదడుని కుంపటి మీద కాపుతూ, కాలుతూన్న ఆలోచనల ఆవిరి చెమట బిందువుల రూపంలో నుదురుమీద ప్రత్యక్షమవుతోంది.. కటాలున అతని కళ్ళు మెరిశాయి.

"మూతకింద వున్న గిన్నె మారిందేమో అని మనం బుర్రలు బద్దలుకొట్టుకుంటున్నాం. గిన్నెమీద పెట్టిన మూత మారిందేమో అని ఒక్కసారికూడా ఆలోచించలేదు!" అన్నాడు టెంపో గంభీరంగా.

గిరీశ్ ఆర్య అమరం వింటున్న సంస్కృతంరాని వ్యక్తిలా చూస్తూ వెనక్కివాలి ఆరిపోయిన చుట్ట ముట్టించడంలో మునిగిపోయాడు. ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ అర్థంకానట్టు చూశాడు.

"టెంపో, ఇక్కడికి వచ్చినప్పట్నుంచీ ఆడియో పద్ధతిలో నన్ను ఎడ్యుకేట్ చేశావు ఇప్పుడే వీడియో ద్వారా విజువల్ ఎడ్యుకేషన్ అందించావు. విషయం

వొలిచేసిన అరటిపండులా అర్థమైంది. అయితే, నీ మాటలు పూర్తిగా అర్థంకావడం లేదు! అదేదో గిన్నె, మూత థియరీ అర్థమయేలా చెప్పు!"

టెంపో చిన్నగా నవ్వాడు. "పృథ్వీరావ్, ఫిల్మ్‌లో శశిప్రియకాకుండా డూప్ ఉంటేమో అన్న కోణం లోంచీ చూస్తూ వుండిపోయాం. టెక్నికల్‌గా, లాజికల్‌గా ఆమె ఆమే అయ్యుండొచ్చని నిర్ధారించుకున్నాక కూడా ఆ అనుమానం దుప్పటిలా నా మెదడుని కప్పేసింది. శశిప్రియ శశిప్రియే! ఆమెతోబాటు ఫిల్మ్‌లో కనిపిస్తున్న వ్యక్తి ఆ వ్యక్తి కాడు!"

పృథ్వీరావ్ నెత్తి బరుక్కున్నాడు. "ఇంకా చెప్పు...."

"శశిప్రియతోబాటు బొమ్మలో ఆడుతున్న ఆ ఆబోతు వెనక, అసలు వ్యక్తి ఉన్నాడు!"

"వాట్?" పృథ్వీరావ్ ఆశ్చర్యంతో అరిచాడు.

"యస్! ఈసారి చెప్పండి!" గిరీశ్ ఆర్య దయవేశాడు.

"ఫిల్మ్‌లో ఒరిజినల్‌గా శశిప్రియా ఆమె భర్త గంగాధర్ ఉన్నారు. ఇప్పుడు శశిప్రియ శశిప్రియగానే వుంది. గంగాధర్ స్థానంలో ఆబోతుగాడున్నాడు గిన్నె గిన్నెగానే వుంది. మూత మాత్రం మారింది!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"యూ మేబీ రైట్. బట్...." ఏదో చెప్పబోతున్న పృథ్వీరావ్‌కి గిరీశ్ ఆర్య అడ్డుతగిలాడు.

"నో ఇన్‌స్పెక్టర్. మిస్టర్ టెంపో ఈజ్ సెంట్ పర్సెంట్ రైట్! ఎందుకంటే, ఫిల్మ్‌లోని మగాణ్ని డూప్‌గా అనుకోడానికి ఆస్కారం వుంది!" అన్నాడు ఆర్య ఉత్సాహంగా.

"సో.... ఇందాకా అర్థంలేకుండా వినిపించిన నా వాగుడుకి ఇప్పుడు అర్థం ఏర్పడింది. హైదరాబాద్ హోటల్ గోల్కొండలో ఏకాంతంలో వున్న శశిప్రియా గంగాధర్ల ప్రణయ సన్నివేశాల్ని యెవరో పథకం ప్రకారం కెమెరాలోకి ఎక్కించుకున్నాడు. గంగాధర్ని డూప్ వ్యక్తి శరీరంతో దాచిపెట్టేశారు!" టెంపో ఇంకొంచెం విడమరిచాడు.

"ఎవరు?" పృథ్వీరావ్‌లోని ఇన్‌స్పెక్టర్ ఠక్కుమని ప్రశ్నను పేల్చాడు.

"ఎవరైనా కావొచ్చు! అయితే ఒకేఒక కాపీగా దొరికిన ఈ బ్లూ ఫిల్మ్, ఆ వ్యక్తుల్ని, లేక వ్యక్తిని పట్టుకోడంలో మన అన్వేషణని చాలామట్టుకు తగ్గించేస్తోంది...."

"ఇంకేం? ఎవరెవర్ని అనుమానించవచ్చో చెప్పెయ్?" పృథ్వీరావ్ ఉషారుగా అన్నాడు.

టెంపో సాలోచనగా తలపంకించాడు. చూపుల్ని గిరీశ్ ఆర్యవైపు తిప్పాడు.

"గిరీశ్ ఆర్య ఈసారి మళ్ళీ, 'సాంకేతిక నేత్రంతో' ఫిల్మ్‌ని చూస్తారు. ఆ తరవాత...."

"మిష్టర్ టెంపో, పదేళ్ళక్రితం భార్య పోయినప్పట్నుంచీ, సినీ ఫీల్డులో వున్నా కూడా, నా బ్రహ్మచర్యాన్ని కాపాడుకుంటూ వస్తున్నాను. శశిప్రియ బ్లూ ఫిల్మ్ చూపించీ, చూపించీ, మూసేలా చేసి నా పదేళ్ళ బ్రహ్మచర్యాన్ని పటాపంచలు చేసేలా వున్నారు!" గిరీశ్ ఆర్య అడ్డొస్తూ అన్నాడు.

టెంపో పకపకనవ్వాడు. పృథ్వీరావ్ కృతికలిపాడు.

• • *

రెండోసారి బ్లూ ఫిల్మ్ చూసి అలిసిపోయిన పృధ్వీరావ్ కి, గిరీశ్ ఆర్యకి టెంపో టీ అందించాడు. టీ తాగేసి గిరీశ్ ఆర్య నిట్టూర్చాడు.

"మిస్టర్ ఆర్యా, ఇప్పుడేమంటారు?" టెంపో ప్రశ్నించాడు.

"ఇదివరకూ, చూస్తున్నంతసేపూ శశిప్రియ మీదే నా దృష్టిని కేంద్రీకరించాను. దానికారణం తల మాత్రమే శశిప్రియది అయివుండొచ్చన్న అనుమానం. ఈసారి నా 'టెక్నికల్ ఐ'ని ఆటాలుకి రివిట్ చేశాను. వాడు నిస్సందేహంగా డూపే!" గిరీశ్ ఆర్య ఉద్రేకంతో అన్నాడు.

"ఖచ్చితంగా చెప్పగలరా? ఎందుకంటే మనకున్న ఆధారమల్లా ఆ ఫిల్మ్ ఒక్కటే! వేడెక్కిన బుర్రని చల్లబరుచుకోడానికి మనం తొందరపడకూడదు!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"గవర్నమెంట్ స్టాంప్ పేపర్ మీద చెయ్యికోసి రాసిస్తాను! సందేహంలేదు మీ భాషలో చెప్పాలంటే మాతి ఒరిజినల్ కాదు. డూప్లికేట్! డూప్ లో 'కో ఆర్డినేషన్ ఆఫ్ మైండ్ అండ్ బాడీ' ఉండాల్సినంత పర్ఫెక్ట్ గా లేదని మీరూ గమనించే వుంటారు!" గిరీశ్ ఆర్య నవ్వుతూ అన్నాడు.

"థాంక్యూ వెరీమచ్. కనీసం శశిప్రియ నిజాయితీని మనం నిరూపించుకున్నాం" అన్నాడు టెంపో.

"యస్. ఐ లైక్ దట్ కిడ్. మంచిపిల్ల. ఈ ఫిల్మ్ చూశాక శశిని ఇంకా ఎక్కువగా లైక్ చేస్తున్నాను!" గిరీశ్ ఆర్య నవ్వుతూ అన్నాడు.

పృథ్వీరావ్ బిగ్గరగా నవ్వాడు.

"ఆర్యులు ఆ లైకింగ్ ని లిమిట్ చేసుకోడం మంచిది. లేకపోతే పదేళ్ళ బ్రహ్మచర్యం బ్రహ్మపుత్రలో కలిసి పోతుంది!" టెంపో నవ్వుతూ అన్నాడు.

గిరీశ్ ఆర్య కులాసాగా నవ్వుతూ వుండిపోయాడు. దగ్గుగా మారిపోతున్న నవ్వుని ఆపుకుని కళ్ళు చిట్లిస్తూ టెంపోని చూశాడు.

"మిష్టర్ టెంపో, ఇంతకీ ఈ ఫేక్ బ్లూని ఎవరు తయారుచేసి వుంటారు?

"మనం ఇప్పటిదాకా సగమే తవ్వాం. ఇంకా సగం తవ్వితేగానీ నీటిచుక్క అవుపించదు!" టెంపో నవ్వుతూ అన్నాడు.

గిరీశ్ ఆర్య తలపంకిస్తూ రిస్టువాచీ చూసుకున్నాడు. "నేను వెళ్ళొచ్చా? అవతల స్టుడియోలు అంటుకుంటాయి!"

"పిలవగానే వచ్చారు. పావుగంటే అనకుండా కూచున్నారు. థాంక్స్ ఎలాట్! వెళ్ళిరండి" టెంపో చెయ్యి ముందుకి చాచాడు.

కరచాలనంచేసి గిరీశ్ ఆర్య పృథ్వీరావ్ వైపు చూశాడు. పృథ్వీరావ్ లేచి కరచాలనం చేశాడు.

* * *

సోఫాలో కూచుని డిటెక్టివ్ టెంపో సిగరెట్ వెలిగించాడు. ఇన్ స్పెక్టర్ పృథ్వీరావ్ అతన్ని ప్రశ్నారకంగా చూశాడు.

"టెంపో, ఇప్పుడు చెప్పు; ఎవరు?"

"చెప్తాను."

"ఎందుకు?"

"చెప్తాను"

"ఎప్పుడు?"

"పృథ్వీరావ్, ఇంటికెళ్ళు. 'లవ్ ఎట్ ఫస్టు సైట్ డే' సెలబ్రేట్ చేసుకుంటూ రాత్రి తొమ్మిదిన్నరదాకా నీ శ్రీమతితో వుండిపో. తరవాత ఈ డ్రెస్సు తీసిపారేసి, యూనిఫామ్ తగిలించుకో. సరిగ్గా పదింటికి నేను చెప్పే అడ్రసుకి రా!" టెంపో నవ్వుతూ అన్నాడు.

పృథ్వీరావ్ నిస్సహాయంగా చూశాడు. "ఇది అన్యాయం! మా ప్రేమకూ, పెళ్ళికీ సంబంధించిన డజను రోజుల్లో భూకంపాలు వచ్చినా యూనిఫాం వేసుకోకూడదని శిరీష ఆంక్ష పెట్టి, బాస తీసుకుంది! పైగా పదిగంటలకి ఇంట్లో లేకపోతే ..."

టెంపో పకపక నవ్వాడు, "పృథ్వీ, ఐ పిటీ యూ! శిరీషకి నేను చెప్పానని చెప్పు."

"చెప్తే, వెళ్ళి నీ గదిలోనే బజ్జోమంటుంది! ఆల్ రైట్ ....తప్పదుగా!" అంటూ పృథ్వీరావ్ లేచాడు.

"తప్పించుకో లేవు! వైదిక్ ఉత్తి చేతుల్తో రావొద్దు. బేడీలతో రా!" టెంపో నవ్వుతూ అన్నాడు. అతని మాటల్లోని రెండో అర్థం పృథ్వీరావ్ కి నవ్వు తెప్పించింది.

"ఎక్కడికి?"

"తెలీదు!" టెంపో నవ్వుతూ అన్నాడు. "తెలుసుకుని, తొమ్మిదిలోగా ఫోన్ చేస్తాను...."

పృథ్వీరావ్ మళ్ళీ కూచున్నాడు. అదోలా టెంపోని చూశాడు. "గురూ.... ఈ కేసులో ఇంక మునిగిపోయేదేం లేదు! తొందరపడొద్దు. తీరిగ్గా ఆలోచించు తీరిగ్గా రేపో ఎల్లుండో నిన్ను కల్సుకుంటాను. అప్పటికి దారా అన్నింటినీ కలిపి తాడుగా పేనేయ్. కనిపించీ కనిపించనట్టున్న ఆధారాల్తో, అనుమానాన్ని రీయిన్ ఫోర్స్ చేసి

పప్పులో కాలేసి...."

"పృథ్వీరావ్, అరగంటనుంచీ దారాలన్నీ నా బుర్రలో తాడుగా అల్లుకుపోతున్నాయ్! అయిదుగురు నలచక్రవర్తుల్ని ఒకేక్షణంలో చూస్తూ దండని ఎవరి మెడలో వేయడమా అని సందేహిస్తున్న దమయంతిలా వున్నానిప్పుడు! శశిప్రియ తనకి ఎవ్వరూ శత్రువులు లేరంటూ చెప్పింది. గానివ్ వీరుడు చిన్నారావు కథనం ప్రకారం ఆమెకి ముగ్గురు శత్రువులున్నారు...."

"చెప్పవేం?" పృథ్వీరావ్ ఉత్సాహంగా అన్నాడు.

"ఆమెకి భర్తగా రూపొందకముందు గంగాధర్ డైరెక్టు చేసిన 'చీకట్లో నీడలు' నిర్మాత సప్తగిరిమూర్తి శశిప్రియను ద్వేషిస్తున్నాడు. చీకట్లో నీడల్లో వేలు కరుచుకున్న అతను నామినల్ రేటుమీద తన రెండో పిక్చర్లో నటించమని ఆమెని అడిగాడు. ఆమె నిరాకరించింది. కాల్ షీట్స్ లేవంది. చీకట్లో నీడలు డైరెక్టు చేసిన గంగాధర్ తన భర్త కాడంది. తన భర్త అయ్యాక డైరెక్టు చేసివుంటే ఫ్రీగా యాక్టు చేసి పెట్టేదాన్నంది. సప్తగిరిమూర్తికి ఆమెమీద ఏడుకొండలంత కసివుంది!"

"తరవాత?" పృథ్వీరావ్ అడిగాడు.

"రెండో వ్యక్తి: ప్రొడ్యూసర్ వీరాస్వామినాయుడు. శశిప్రియకి ఫస్ట్ ఛాన్స్ ఇచ్చిన వ్యక్తి. పరిశ్రమలో అతని ప్రత్యర్థి వీరారెడ్డి చిత్రంలో నటించవద్దని అతను శశిప్రియకి సలహా ఇచ్చాడు. ఆమె అతనిమీద తిరగబడింది. ఇతర నిర్మాతల్ని ఇన్ఫ్లుయెన్స్ చేసి ఆమెకి భవిష్యత్తు లేకుండా చేయడానికి వీరాస్వామినాయుడు యెంతో ప్రయత్నించాడు. అతనిది పాము పగ అని ఇండస్ట్రీలో అందరికీ తెలుసు...."

"సెట్స్?"

"హీరో ఇంద్రమోహన్; నటి భామిని" టెంపో జవాబిచ్చాడు.

"కారణం?"

"ఇంద్రమోహన్ శశిప్రియను దారుణంగా ప్రేమించాడు. ఆమె తన భార్య అయితే, ఆమె చిత్రాల్లో తనకి మంచి ఛాన్సులుంటాయని అతను ఆశించాడు. హీరో హీరోయిన్లయిన తామిద్దరూ మొగుడూ పెళ్ళాలయితే మంచి మంచి చిత్రసంతానాన్ని కనొచ్చని ఆశించాడు. శశి అతన్ని మోకాలితో తోసేసి, గంగాధర్‌ని కట్టుకుంది. అలాగే భామిని గంగాధర్ మీద కన్నేసింది. ఆమెని నిర్లక్ష్యం చేసి అతను శశిప్రియను నెత్తిన కూచో బెట్టుకున్నాడు. సో, శత్రువుల శత్రువులిద్దరూ మిత్రులై భార్యాభర్తలైపోయారు. కానీ, ఇద్దరూ ఇద్దర్నీ మరిచిపోలేదు!"

"చాలు, తల తిరిగిపోతోంది!" పృథ్వీరావ్ నీరసంగా అన్నాడు.

"ఇంకా వుంది: ఇంకా ఒక వ్యక్తి వున్నాడు: శేఖర్!"

"ఒప్పుకుంటాను. నువ్వు చెప్పిందాన్నిబట్టీ శేఖర్‌కి రీజనబుల్ మోటివ్ వుంది. అట్లాగే ఇందాకా చెప్పిన వాళ్ళందరికీ వుంది. ఇంతమందిలో దొంగ ఎవరిలో దాక్కున్నాడో కనిపెట్టడం అంత సులభంకాదు! ఈ రోజుల్లో జరిగేది అసలేకాదు!" పృథ్వీరావ్ కంఠంలో నిర్ధారణ ధ్వనించింది.

"వీళ్ళందరికీ గురువు, చిత్రపరిశ్రమకి కురువృద్ధుడు, దర్శక నిర్మాత, ప్రస్తుతం చాలామంది నిర్మాతలకి

ఫైనాన్షియర్ ప్రత్యగాత్మారామ్ ఉన్నాడు. నాలు గింటికి వాళ్ళల్లో కొందర్ని ఆయన ఇంట్లో నేను కల్సు కుంటున్నా. ప్రత్యగాత్మారామ్ నాకు మిత్రుడని నీకు తెలుసు!" టెంపో ముగించాడు.

పృథ్వీరావ్ నిట్టూర్చాడు. "ఓకే.. నువ్వు పొమ్మంటే పోతాను; రమ్మన్నప్పుడు వస్తాను...."

"తొమ్మిదింటికి ఫోన్ దగ్గరగా, శిరీష దగ్గరగా కూచో!" టెంపో నవ్వుతూ అన్నాడు.

8

మూసిన గది తలుపుల్ని చూస్తూ డిటెక్టివ్ టెంపో హాలుమధ్య స్తంభంలా కాసేపు నిలబడ్డాడు. లోప ల్నుంచీ పొంగుకొస్తున్న ఉద్రేకాన్ని ఏదో అనుమానం బలహీనంగా అణగదొక్కుతోంది. గోడగడియారం రాగ యుక్తంగా శబ్దం చేయసాగింది. ఆలోచనల్లోంచీ తెప్పరిల్లి అతను గడియారంకేసి చూశాడు. పది ...

క్షణంలో ఒక నిర్ణయానికి వచ్చి టెంపో మేడ మెట్లవేపు కదిలాడు. మెట్లని కప్పిన రెడ్ కార్పెట్ అతని బూట్లు చేయబోతున్న శబ్దాన్ని మింగేస్తోంది. కాసేపట్లో పైకి చేరుకుని, మూసిన తలుపుల ముందు నించున్నాడతను. లోపల్నుంచీ ఏ శబ్దమూ వినిపించడం లేదు. టెంపో వేళ్ళ కణుపుల్తో తలుపుమీద చప్పుడు చేశాడు.

నిశ్శబ్దం. అతని వేళ్ళు రెండోసారి తలుపుని తట్టాయి.

"ఎవరు?" బొంగురు కంఠం కసిరింది.

"తలుపు తెరవండి!" టెంపో బిగ్గరగా అరిచాడు.

"డోంట్ డిస్టర్బ్! గెటౌట్!" బొంగురు కంఠం కోపంగా గర్జించింది.

"తలుపు తెరిచేదాకా తట్టుతూనే వుంటాను; తెల్లారి పోయినాసరే!" టెంపో కంఠం ప్రతిధ్వనించింది. తలుపు మీద అరచేతిని ఆన్చి, టెంపో సిద్ధంగా నిలబడ్డాడు.

తటాలున గొళ్లెం లాగబడింది. తలుపు విసురుగా లోపలికి కదిలింది. టెంపో తన శక్తిని అరచేతిమీదికి కేంద్రీకరించాడు. తలుపు బలంగా తోయబడింది.

గుమ్మంలో నిలబడ్డ వ్యక్తి రౌద్రంగా చూస్తున్నాడు. పొడుగ్గా, బలిష్టంగా వున్న ఆకారం. పక్కపాపిడి క్రాపు, సన్నటి మీసాలు. అతని కళ్ళు ఎర్రగా వున్నాయి. గళ్ళలుంగీ ఒకే గుండీ పెట్టుకున్న పొడుగు చేతుల చొక్కా. అతను ఆదరాబాదరా డ్రెస్ చేసుకు వచ్చినట్టు చెప్తోంది.

"వాటీస్ దిస్? ఎవర్నువ్వు?" కోపంతో అతని పెదవులు వణికాయి.

"డిటెక్టివ్ టెంపో పేరు వినేవుంటారు..." టెంపో మర్యాద ఉట్టిపడేలా అన్నాడు. అతని చెయ్యి బలంగా తోస్తునే వుంది.

"టెంపో పేరూ వినలేదు, టాక్సీ పేరూ వినలేదు. గెటౌట్!" హుంకరించాడతను.

"ఐ వాంటు టూ గెట్ ఇన్. అయామ్ గోయింగ్ టూ గెట్ ఇన్! అండ్ అయామ్ గెటింగ్ ఇన్!" అంటూ టెంపో తలుపునీ, అతన్నీ తోస్తు కుంటూ లోపలికి జొరబడ్డాడు. తలుపు కొద్దిగా ముందుకు కదిలింది.

"ఏమిటీ దౌర్జన్యం? ఐ విల్ సీ దట్..." టెంపో చేతుల్లోని బలాన్ని కొద్దిగా రుచిచూసిన అతను రొప్పుతూ

అరిచాడు.

"శాబాష్ భజం తీలతో లాకప్ లోకి ఊరేగుతూ వెళ్ళకూడదనుకుంటే కిక్కురుమనకుండా పడుండు!" టెంపో నిర్లక్ష్యంగా అన్నాడు.

అతని చెయ్యి బలంగా టెంపో భుజమ్మీద పడింది. టెంపో యెడమ చెయ్యి అతని మణికట్టుని పట్టకారులా పట్టుకుంది. టెంపో అతనివైపు చూడ్డం లేదు. సలుపు అతని భుజంలోకి మెరుపువేగంతో ఎగబాకివుంటుందని టెంపోకి తెలుసు.

మంచం దగ్గరగా గోడకి ఆనుకుని నించుని, కంగారుగా చూస్తున్న యువతిని చూస్తూ టెంపో సన్నగా ఈలవేశాడు. ఆమె కళ్ళల్లో సిగ్గూ, భయం ప్రత్యక్షమవుతున్నాయి. పల్చటి చీరని రెండు చేతుల్తో గడ్డం కింద పట్టుకుందామె. చీర అస్తవ్యస్తంగా కిందకి వేళ్ళాడుతోంది. చీర వెనక ఆమె తప్ప మరో గుడ్డ ఏదీ లేదని టెంపోకి తెలుసు.

టెంపో, తన భుజంమీద అతని వేళ్ళు వొణుకుతున్నట్టు గ్రహించాడు. మెల్లిగా తలతిప్పి అతన్ని నవ్వుతూ చూశాడు. అతని చేతిని భుజమ్మీంచీ విసురుగా, దూరంగా లాగాడు. నొప్పిని దిగమింగే ప్రయత్నం చేస్తున్న అతని నోరు వంకర్లు తిరిగింది. కళ్ళల్లో ఆగ్రహం జతకి బాధ చేరింది.

"బుద్ధిగా, తోక ముడుచుకుని వెళ్ళి మంచంమీద కూచో!" టెంపో బెదిరిస్తున్నట్టు అన్నాడు. టెంపో చేతిపట్టునుండీ విముక్తి పొంది తోలులా కిందకి వేళ్ళాడుతున్న తిమ్మిరెక్కిన చేతిని ఎడం చేత్తో ఆప్యాయంగా పట్టుకున్నాడతను.

"వచ్చిన పనేమిటో చెప్పేసి, వెళ్ళిపొండి. అయామ్ బిజీ...." అన్నాడతను బహువచనం ఉపయోగిస్తూ.

టెంపో చిన్నగా నవ్వాడు. "నువ్వు బిజీగా వున్నావని వొంటికి అడ్డం పట్టుకున్న శోలా చెప్తోంది! నేను వచ్చిన పని ఇరవై నాలుగు రీళ్ళ సినిమా అంత పెద్దది. కళ్ళిప్రియ బ్లూ ఫిల్మ్‌లా అంత త్వరగా అయిపోదు, గంగాధర్!" టెంపో వెటకారంగా అన్నాడు. గంగాధర్ అప్రయత్నంగా ఒకడుగు వెనక్కి వేశాడు.

"వాట్ డూ యూ మీన్?" అతని బొంగురు కంఠం వణికింది.

టెంపో వినపడనట్టు శోలా వైపు చూశాడు. "శోలా, గోడకి కరుచుకోడం మానేసి బాత్‌రూమ్‌లోకి పరుగెత్తు. స్నానం చేయడానిక్కాదు, చీర కట్టుకోడానికి!"

క్షణకాలం తటపటాయించి, శోలా గోడని అనుకుని అలాగే పక్కవాటంగా ఎడంవేపుకి జరగడం ప్రారంభించింది. క్షణాల్లో ఆమె వీపు బాత్‌రూమ్ డోర్ని తాకింది. చీరని ఒక చేత్తో జాగ్రత్తగా పట్టుకుని మరో చేతిని వెనక్కి తిప్పి, వెనక్కి పోనిచ్చి, హాండిల్ తిప్పుతూ డోర్ని తోసింది. వెనక్కి కదల్తూ బాత్‌రూమ్‌లోకి మాయమైంది. తలుపు మెల్లిగా మూసుకుంది.

"మిష్టర్...నువ్వు... మీరు.....చాలా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. యేడుస్తూ పశ్చాత్తాపపడతారు!" గంగాధర్ మాటలు అతని అట్టడుగులో వున్న కోపాన్ని తాడులా పైకిలాగే ప్రయత్నం చేశాయి.

టెంపో అతన్ని హీనంగా చూశాడు. "కట్టుకున్న పెళ్ళాంతో బ్లూ ఫిలిమ్ తయారు చేయడంకన్నా, కట్టుకున్న పెళ్ళాం ఇంట్లో వుండగానే ఆమె బెడ్

రూమ్‌లో, ఆమె బెడ్ మీదే కోలాలాంటి వాళ్ళున్నారు నే ఆడాళ్ళతో పలకడం కన్నా, నా ప్రవర్తన అసభ్యం కాదు గంగాధర్!"

"ఏమిటీ వెర్రివాగుడ్?" గంగాధర్ గర్జించాడు.

"భార్య ప్రణయాన్ని బ్లూఫిల్మ్ తీయకుండా, ఏదో తెలుగు సినిమాని నువ్వు డైరెక్టు చేయాల్సింది!"

"వాట్ నాన్సెన్స్..."

"నీ బ్లూ ఆటా, నీ ఆటా కట్టయింది గంగాధర్. బుకాయించే అవకాశం నీకు లేదు!" టెంపో సగర్వాంగా అన్నాడు.

గంగాధర్ మింగేసేలా చూశాడు. "నీకు నిజంగా పిచ్చిపట్టింది. భార్యతో బ్లూ ఫిలింతీసి యే భర్తా లోకానికి చూపించడు! ఇంక కోలా సంగతి. ఇది నా ఇల్లు. కోలా నా మనిషి. నా ఇంట్లో, నా మనుష్యులతో నా ఇష్టమొచ్చినట్టు ఎగురుతాను. అడ్డు చెప్పడానికి నువ్వెవరు?"

"ఎగిరావు, చాలా ప్రమాదకరమైన ఎత్తుకి. అంత ఎత్తునుంచీ కుప్పకూలిపోతావ్! శశిప్రియతో నువ్వు సాగించిన ప్రణయాన్ని ఫిలిమ్ మీదకి ఎక్కించావు. ఇక్కడ చూపించకుండా, చాలా నాచురల్‌గా, అమాయకత్వం నటిస్తూ పాఁస్‌లో ఆమె ఆ చిత్రం చూసేలా ప్లాన్ చేశావు..."

గంగాధర్ నవ్వు టెంపో మాటలకి అనకట్ట కట్టింది. "నా భార్యతో నేను సాగించిన ప్రణయం! ఇంకాసేపట్లో ఆ ఫిల్మ్‌లోని మగాణ్ని నేనే అనేలా వున్నావు!"

"ఇంకాసేపట్లో కాదు, ఇప్పుడే అంటాను! ఫిలిమ్

లోని ఆ ఆబోతు తోలుకింద దాక్కున్న కోడెదూడ నువ్వే! చాలా చాకచక్యంగా, నీ తల తీసి మరో తల తగిలించావు! నీ శరీరం...."

"ఎందుకో! శశిని నేను ప్రేమించి పెళ్ళాడాను. ఆమెకి అందం. టాలెంట్, డబ్బూ అన్నీ వున్నాయి. ఆమెకి ఉన్నవన్నీ నావే! ఏమిటి సాధించాలని నా భార్యని బ్లూ ఫిలింలోకి దించాను? భార్యని బ్లూ బొమ్మగా దించి, ఏ భర్తా లోకానికి చూపించడని ఇందాకే చెప్పావు!" గంగాధర్ వెటకారంగా అన్నాడు.

టెంపో చిన్నగా నవ్వాడు. "డబ్బుకోసం కట్టుకున్నదాన్ని పరాయి మగాళ్ళకి అమ్మే లుచ్ఛాలున్న ఈ లోకంలో, పెళ్ళాంతో బ్లూ ఫిలింతీసి చూసే, చూపించే నీలాంటి పెద్దమనుషులూ వుంటారు, గంగాధర్!"

గంగాధర్ కళ్ళు గాలివూదబడిన నిప్పుకణాళ్ళా అయ్యాయి. పిడికిళ్ళు బిగుసుకున్నాయి. "నీతో వాదిస్తూ కబడీ ఆడాల్సిన అవసరంలేదు. అయినా, నా హోదాని దృష్టిలో వుంచుకుని, ఒకమాట చెప్తాను. ఆ ఫిల్మ్ శశికి పెళ్ళికాకముందే తీయబడింది. కళ్ళు తెరిచిచూస్తే నీకు తెలుస్తుంది!"

"టెంపోగారూ...."

టెంపో చటాలున తలతిప్పి చూశాడు. గుమ్మంలో నిలబడి శశిప్రియ ఆందోళనతో చూస్తోంది. "టెంపో గారూ....మీరు పొరబడ్డారు. నందిని ఆబోతనుకుంటున్నారు! అయినా....అలాంటి పని చేయదు! అందులో— ఆ ఫిల్మ్‌లో—ఏదో మిస్టరీ వుంది. వెళ్ళాల్సిన చోటికి

వెళ్ళండి! ప్లీస్ ...."

టెంపో చిన్నగా నవ్వాడు. "రావాల్సిన చోటికే వచ్చాను. మిస్టరీని బట్టబయలు చేస్తాను!" అన్నాడు గంభీరంగా.

"టెంపోగారూ...."

"శశీ....నిన్ను నేను సాధించలేదు; బాధించలేదు. నీ మానాన నిన్ను వదిలేశాను. జరిగిందాన్ని నెమ్మదిగా జీర్ణం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాను. తొందర పడ్డావు. ఈ అనుమానం మనిషిని, అనవసరంగా నా మీదికి ఉసిగొలిపావు!" గంగాధర్ సాధింపుగా అన్నాడు.

"శశిని నువ్వు బాధ పెడుతున్నావో లేదో నాకు తెలీదు. ఆమెని అతి తెలివిగా బ్లాక్ మెయిల్ చేస్తున్నావు! బ్లాక్ మెయిల్ చేయడం బాధించడమనే నా నమ్మకం!"

"శశీ. నీ డిటెక్టివ్ కి మతిభ్రమణ ఉన్నట్టుంది! నిన్ను నేను బ్లాక్ మెయిల్ చేస్తున్నానట! విన్నావా?" గంగాధర్ ఎగతాళిగా అన్నాడు.

"ప్లీస్.... టెంపోగారూ...."

"గంగాధర్, ఆమెని అసహాయ స్థితిలో, నోరెత్తడానికి వీల్లేని చిత్రమైన స్థితిలో పడేశావు. బ్లూఫిలిం ద్వారా ఆమెని డిఫెన్సివ్ గా నడుచుకునేలా చేశావు. ఇందుకోసం నీ నైపుణ్యమంతా వినియోగించావు. నీ బ్లూ ఫిలిం ఉద్దేశం అదే. ఆమె చూస్తే చాలు! లోకం చూడక్కర్లేదు. అందుకే ఆ ఫిలిం కాపీలు ఎక్కడా లేవు! సరిగ్గా నువ్వు హనీమూన్ వెళ్ళే సమయానికి కంఫర్టబుల్ గా పారిస్ చేరింది...."

"మొదట శశిని ఎలా ఎందుకు బ్లాక్ మెయిల్ చేస్తు

జ్ఞానో ఊహించి కథ చెప్పు. నీకిచ్చిన ఫీజుకి ఆమె కనీసం కట్టుకథైనా వింటుంది!" గంగాధర్ అడ్డు తగిలాడు.

"చెప్తాను; కట్టు కథ కాదు. గట్టి నిజం! పెళ్ళయ్యాక ఆమె లావాదేవీలు నీ చేతుల్లోకి తీసుకున్నావు. శక్తికి మించి ఆమె సినిమాల్లో నటించేలా బుక్ చేశావు. ఆమె రేటు పెంచి రెండుచేతులా గుంజుకుంటున్నావు బ్లూ ఫిలిం ఆమె నోరు నొక్కేసింది. నువ్వు విచార సముద్రంలో పూర్తిగా మునిగిపోయి, తనకి దూరంకాకుండా వుంటానికి శశి ప్రయత్నిస్తోంది. ఎందుకని ఆమె నిన్ను అడగదు. డబ్బుని మెల్లిగా పోగేసుకుంటున్నావు. ఆమెని నిర్మాతలకి బానిసలుగా అమ్మేసి, నోరునొక్కేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నావు...."

"ఎందుకో?"

"సినిమాలు తీసిపారేసి. దెబ్బతిన్న నీ రెప్యుటేషన్ని పైకెత్తుకోడానికి. చిత్రలోకంలో టాప్ రాంక్‌లో టాప్‌లో చేరిపోడానికి!" టెంపో నవ్వుతూ అన్నాడు.

గంగాధర్ పగలబడి నవ్వాడు, "నేను నోరు తెరిచి అడిగితే శశిని బుక్ చేసుకున్న నిర్మాతలందరూ కిక్కురుమనకుండా డైరెక్షన్ ఛాన్స్ ఇస్తారు! తరవాత, నాకు సొంతంగా సినిమా తియ్యాలన్న ప్లాన్ వున్నట్టు అద్భుతంగా ఊహించి, నాకు చక్కటి ఐడియా ఇచ్చావు! థాంక్స్!"

"నిర్మాతలు నీకు డైరెక్షన్ ఛాన్స్ ఇవ్వరు. అది నీకు తెలుసు. నాకూ తెలుసు! శశిని నీ ద్వారా బుక్ చేసుకున్న నిర్మాతలు ఛాన్స్‌కు బదులుగా రెండేసి లక్షలు ఎక్కువగా పారేశాయి! వాళ్ళ పేర్లూ, డబ్బిచ్చిన

లేదీలా చెప్పమంటావా? తరవాత....సొంతంగా సినిమా తీసే ఐడియా నాలాంటి వ్యక్తికి ఐశ్వర్యాల్లోగు. నీకే పుట్టుంది; పుట్టింది. త్వరలో నువ్వు ఒక కమర్షియల్ సూపర్ హిట్ తీయబోతున్నావు. టాప్ లెస్ హీరోయిన్ని తెలుగు ప్రేక్షకులకి బహూకరించబోతున్నావు. ఇది నిజమో కాదో బాత్ రూమ్‌లో ఇంకా చీర కట్టుకుంటూనే వున్న శోలాని అడిగితే చెప్తుంది!"

"టెంపో గారూ!" శశిప్రియ ఆశ్చర్యంగా అరిచింది.

టెంపో దగ్గరగా వచ్చిన ఆమెని నవ్వుతూ చూశాడు.

"శశీ, నీలో ఎన్నో సందేహాలున్నాయి; తీరుస్తాను. నీ భర్తకి నడుం పైభాగంలో అరచెయ్యి వెడల్పులో పుట్టుమచ్చ వుంది. ఇవాళే ఆ సంగతి కనుక్కున్నాను. ఫిలింలో వ్యక్తికి ఆ మచ్చ లేదు. మచ్చల్ని సృష్టించినట్టే, మచ్చల్ని తాత్కాలికంగా మేకప్‌తో మాయం చేయొచ్చు! గంగాధర్ హోటల్ గోల్కొండలో నీతో ప్రణయం సాగించినప్పుడు ఆ మేకప్ చేసుకున్నాడు!

"తరవాత....పెళ్ళికిముందే నీ బ్లూ బొమ్మ తయారైందని ఇందాక అతను బుకాయించాడు. జాగ్రత్తగా చూస్తే ఆ ఫిలింతీసేనాటికి నీకు పెళ్ళయిందని అర్థమవుతుంది. తలగడకింద జాగ్రత్తగా పెట్టిన నీ మంగళసూత్రం కొద్దిగా ఇవతలికి కనిపిస్తోంది! మూడింటిలు నీ భర్తే ఆ సమయంలో మంగళసూత్రం తీయించి వుండాలి...."

"మిస్టర్ టెంపో....ఒకసారే కాదు, చాలాసార్లు... ప్రతిసారి నేను మంగళసూత్రం తీసి తలగడకింద పెట్టే దాన్ని....అఫ్‌కోర్స్ ఇద్దరిమధ్యా అదెందుకని ఆయన అనేవారు...." శశిప్రియ కంఠం వణుకుతూ ఆగింది.

మరో సంగతి: గంగాధర్ ఛాతీ నిండుగా ఎలుగొడ్డుకి వున్నట్టు వెంట్రుకలున్నాయి. ఫిల్ములో 'వ్యక్తి' ఛాతీమీద వెంట్రుకలు అసలు లేవు. ఫిల్మ్ షెడ్యూల్ ఫిక్సవ్ చేసుకున్నాక, అతను శరీరంమీద వెంట్రుకలు లేకుండా చేసుకున్నాడు. కత్తిలాంటి గంగాధర్‌కి అదేమంత కష్టమయిన పని కాదు!" టెంపో నవ్వుతూ ఆగాడు.

శశిప్రియ కళ్ళల్లో ఆశ్చర్యం ఆమె కళ్ళకన్నా పెద్దగా అవుపిస్తోంది. అప్రయత్నంగా ఆమె దృష్టి గంగాధర్ వేపు తిరిగింది. గుండీలన్నీ పెట్టుకోని అతని చొక్కాలోంచీ ఛాతీ గొంగళిలా అవుపిస్తోంది. అతని కళ్ళు అదోలా శశిప్రియవైపు చూశాయి.

"శశీ....డోంట్ బిలీవ్ హిమ్. హి ఈజ్ క్రూకెడ్! ఇతడు చెప్పిందంతా కట్టుకథ. నన్ను మాత్రమే కాదు, ప్రతీ భర్తనూ అవమానించే చెత్తకథ అది! నా సంగతి నీకు తెలుసు!" గంగాధర్ ఉద్రేకంతో అన్నాడు.

శశిప్రియ సందిగ్ధంగా అతన్ని టెంపోనీ చూస్తోంది. ఇద్దర్నీ నమ్మాలనిపిస్తోన్న భావం, ఇద్దర్నీ నమ్మకూడదన్న అనుమానం ఆమెని ముందుకీ వెనక్కీ లాగుతున్నాయి. డిటెక్టివ్ టెంపో ఆమెని జాలిగా చూస్తూ, గంగాధర్ వైపు తిరగాడు.

"మిస్టర్, నా గెటౌట్! శశిదగ్గర ఫీజు గుంజాకని, యేమీ చేయలేక, ఫీజు వాపసు చేసే యిష్టంలేక నామీద బురదకొట్టి, ఆమె మనసుని పాడుచేయాలనుకున్నావ్! ఇందుకు మరో కారణం కూడా వుంది. నన్ను ఛండాలుడిగా నీ తర్కంతో చిత్రించి శశిని నాకు దూరం చేయడానికి మరో చోటినుంచీ నీకు చేతుల్నిండా

ఫీజా దొరికింది!"

శశిప్రియ తనవేపు కటాలున తల తిప్పినట్టు టెంపో గుర్తించాడు. ఎగతాళిగా నవ్వుతూ గంగాధర్ని చూశాడు. "మొత్తంమీద సినిమా డైరెక్టరనిపించుకున్నావ్, నీ సీరియల్ని అప్పటికప్పుడే అల్లేస్తున్నావ్! కానీ .."

"అల్లడం కాదు; అసలు సంగతి శేఖర్ని నిలదీస్తే బయటపడుతుంది! శశిని సొంతం చేసుకోలేని ఆ చవటాయ యిప్పుడు ఈ ప్లాన్ వేశాడు! నీ నాటకంతో శశి నాకు దూరమవుతుంది. శేఖర్ గాడు మెల్లిగా ఆమెకి దగ్గరవుతాడు!" గంగాధర్ ఆవేశంతో అన్నాడు.

"శేఖర్ దాకా యెందుకు? నిన్ను నిలేసి నీ చేత నిజం కక్కిస్తాను. ఎవరు, యెందుకు ప్లాన్ చేశారో నాకు బాగా తెలుసు. నీ ప్లాన్‌లో భాగంగా పారిస్ ఓడియన్ థియేటరు ఓనరుకి నువ్వు స్వయంగా క్యాసెట్ అందించిన విషయం క్రైమ్ ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ ద్వారా కనుక్కున్నాను. ఫ్రాన్స్ పోలీస్ ఉన్నతాధికారి అక్కడ నిజాన్ని కక్కించాడు!" టెంపో ఆగి, సిగరెట్ వెలిగించాడు. గంగాధర్ కళ్ళలో కదిలి మాయమయిన యేదో మార్పు అతని చూపుల్నుంచీ తప్పించుకోలేక పోయింది.

"సాధారణంగా బ్లూఫిలిం కాసెట్‌ని కొంటూ యెవకేనా డబ్బిస్తారు. ఓడియన్ వోనరు నీ ఇంటరెస్టు చూసి, నీ ఆత్రం గమనించి ఆ రోజు దాన్ని ప్రదర్శించడానికి నీ దగ్గరే డబ్బు గుంజుకున్నాడు!" టెంపో నవ్వుతూ అన్నాడు.

గంగాధర్ మంచం దగ్గరగా కదిలాడు. తలగడ

పక్కనే పడున్న సిగరెట్ పాకెట్‌ని అందుకున్నాడు. సిగరెట్‌ని వెలిగించి, శశిప్రియని తదేకంగా చూశాడు.

"శశీ, ఈ గదిలో నేనో, అతనో వుండాలి. ఫుట్‌పాత్ మీద నోటికి వచ్చిందల్లా కూసే కొత్తపిచ్చివాడిలా యేమిటేమిటో వాగుతున్నాడు! ఆ ప్రలాపాల్ని వోపిగ్గా వింటున్నావు నువ్వు. ఈ నాటకంలో శేఖరుతో బాటు నువ్వు కూడా పాత్రధారణ చేస్తున్నావని యింత సేపటికీ అర్థం చేసుకోగలిగాను! నీతో పారస్ వెళ్ళినందుకు యిప్పుడు సంతోషిస్తున్నాను. నీ నిజస్వరూపం అక్కడ నాకు కనిపించింది! నిన్ను ప్రేమించాను; గుడ్‌బై శశీ.... బీ హాపీ విత్ యువర్ శేఖర్!"

"గంగాధర్...." శశిప్రియ కంగారుగా అంది.

"అంత తొందరేం లేదు గంగాధర్! కొంచం వోపిక పట్టు!" డిటెక్టివ్ టెంపో ఎగతాళిగా అన్నాడు.

గంగాధర్ కటాలున అతనివైపు తలతిప్పి నిప్పులు కక్కుతూ చూశాడు. "గెటౌట్ యూ...."

బాత్‌రూమ్ డోరు చప్పుడు గంగాధర్‌ని ఆటకాయించింది.

చీర కట్టుకున్న మిస్ కోలా గదిలోకి దూసుకొచ్చింది. ఆవేశంతో ఆమె ఛాతీ ఎగిరెగిరి పడుతోంది. ఎర్రటి కళ్ళతో ఒకసారి గంగాధర్ని చూసి శశిప్రియ వేపు తిరిగింది,

"శశిప్రియగారూ మీరు నన్ను క్షమించాలి. మీ గూటిని కొల్లగొట్టే ఉద్దేశంతో నేను ఇక్కడికి రావడం లేదు. అతనికి ఆడది కావాలి, నాకు డబ్బు కావాలి. అంతే. అయితే. ఈ మధ్య నామీద మోజా యెక్కువైంది. త్వరలో తీయబోయే అచ్చ తెలుగు సినిమా గురించి

వాడు చెప్పాడు గంగాధర్. అందులో మెయిన్ రోల్ వాడు యిమ్మన్నాను. నిజం చెప్పాలంటే ఇచ్చితీరాలని ఒకసారి బెదిరించాను. గంగాధర్ అలా బెదిరే వ్యక్తి కాదు. నా బెదిరింపుకి సమాధానంగా గుడ్డలేని స్థితిలో రహస్యంగా తీసి నా ఫోటోని వాడు ప్రెజెంటు చేశాడు! ఆ ఫోటోతో నా నోరు నొక్కేశాడు...."

"యూ బిచ్...." గంగాధర్ అరిచాడు.

"గంగాధర్ లుచ్ఛా. నా నేకెడ్ ఫోటో తీసినట్టే మీ బ్లూఫిలిం కూడా తీసివుంటాడు!" శోలా అతన్ని పట్టించుకోకుండా హుంకరించింది.

గంగాధర్ మెరుపులా కదిలాడు. అతని చెయ్యి మెరుపులా కదిలింది శోలా చెంప చెళ్ళుమంది. కెవ్వున అరుస్తూ శోలా గోడకి విసురుగా పడింది. గంగాధర్ రౌద్రంగా టెంపో వైపు తిరిగాడు.

"నువ్వు కడుతున్న అబద్ధాల గోడకి అబద్ధాల ఇటుకలు సప్లై చేయడానికి శోలా ముండనీ ముందు జాగ్రత్తతో నియమించావన్న మాట! ఆల్ రైట్!.... శశి...."

"గంగాధర్, సినీఫీల్డులో ఆకాశాని కెక్కడం కోసం శశిని బలిచేసి, ఆమె డబ్బుతో నిచ్చెన తయారు చేసుకోవాలనుకున్నావ్. ఆమెని బ్రెయిన్ వాష్ చేసి పెళ్ళాడంలో నీ ఉద్దేశం అదే అని నా పరిశోధన వల్ల వెల్లడైంది. నేను చెప్పేదంతా నిజమనీ, నువ్వాడేవన్నీ, ఆడినవన్నీ అబద్ధాలే అనీ నిరూపించే సాక్ష్యం, డూప్ లని ఉపయోగించక ముందు తీసిన బ్లూఫిల్మ్ కాపీ నీ గదిలో నే దొరుకుతుంది!" టెంపో గబగబా అన్నాడు; ఓరగా శశిని చూస్తూ.

శశిప్రియ వాలుగా గంగాధర్ని చూస్తోంది. ఆమె చూపులు మంచం వెనక గోడలోకి వున్న అలమారమీద క్షణకాలం నిలిచాయి. టెంపో గొంతెం ముందుకి కదిలాడు.

"శశీ, నీలో యింకా మిగిలివున్న అనుమానాన్ని పటాపంచలు చేసే ఆ అసలు క్యాసెట్ ని ఇప్పుడే నీకు చూపిస్తాను!" అంటూ టెంపో అలమారవైపు నడిచాడు. జేబులోంచి స్కెలిటన్ కీని ఇవతలికి తీశాడు.

గంగాధర్ మంచంమీద కూచున్నాడు. శశిప్రియా, యిప్పుడు లేచి విగ్రహంలా నించున్న కోలా కళ్ళు పెద్దగా చేసుకుని టెంపోవైపే చూస్తూన్నారు. గంగాధర్ నిర్భయంగా సిగరెట్ వెలిగించాడు. కాసేపట్లో అలమార తాళంచెవి క్లిక్ మంది. శశిప్రియ అసంకల్పితంగా అలమారవైపు కదిలింది.

అలమార పై అరలో, బ్రౌన్ కవర్లో భద్రం చేయబడిన క్యాసెట్ ని టెంపో ఇవతలికి తీశాడు. నవ్వుతూ, తన సమీపంలో నిలబడ్డ శశిప్రియను చూశాడు.

"నిన్నూ అతన్నీ మూపించే అసలు క్యాసెట్ ఇదే అని నా నమ్మకం!" అన్నాడు చిరునవ్వుతో.

"నీ నమ్మకాన్ని జేబులో దాచుకుని, ఆ క్యాసెట్ ని ఇలా విసురు!" గంగాధర్ కంఠం వినిపించి టెంపో వెనక్కి తిరిగిచూశాడు.

మంచం ముందు నిటారుగా నించున్నాడు గంగాధర్. అతని చేతిలో రివాల్వరు మెరుస్తోంది. అతని పెదవుల చివర్లలో చిరునవ్వు గర్వంగా తొంగిచూస్తోంది. అతని కనుగుడ్లు కదలడం మానేసిన గోలీకాయలా వున్నాయి. రెప్పలు కదల్చకుండా టెంపోనే చూస్తు

న్నాడతను.

భయం తో, ఆశ్చర్యంతో శశిప్రియ ఊపిరి పీల్చు కోడం టెంపోకి స్పష్టంగా వినిపించింది.

డిటెక్టివ్ టెంపో కనుబొమలు పైకి లేచాయి. చిరునవ్వు అతని పళ్ళమీద తేల్లగా మెరిసింది. క్యాసెట్ పట్టుకున్న అతని చెయ్యి కొద్దిగా కదిలింది. గంగాధర్ చేతిలో రివాల్వరు కొద్దిగా, పైకి టెంపో ఛాతీ ఎడం వైపుకి చూసింది.

"ఆగు!" గంగాధర్ గర్జించాడు.

"క్యాసెట్ని విసరొద్దు మెల్లిగా మంచం నీ కాళ్ళకి తగిలేదాకా ముందుకి కదులు. క్యాసెట్ని మంచంమీదకి వదులు. రెండు చేతుల్నీ పైకెత్తు!" గంగాధర్ హెచ్చరించాడు.

కదలబోయిన టెంపోని శశిప్రియ కంఠం ఆపింది.

"గంగాధర్!" ఆమె కంఠంలో ఆశ్చర్యం, ఆవేదనా కలిసి ధ్వనించాయి. "అయితే....అయితే.... టెంపో గారు చెప్పిందంతా నిజమే అన్నమాట!నిన్ను.... నిన్ను....ఎంత ప్రేమించాను....గంగాధర్! నిజాన్ని నమ్మడంలో....నా ప్రేమ....ఇంత సేపూ నాకు అడ్డు తగులుతూనే వుంది...ఇదంతా అబద్ధమనీ........నువ్వీ దారుణం చేయలేదనీ చెప్పు గంగాధర్!" శశిప్రియ ఆవేశంతో, ఆవేదనతో అరిచింది. టెంపో ఆమెని వాలుగా చూశాడు. కన్నీళ్ళు ఆమె మొహంమీద కాలువలు కట్టున్నాయి. రెండు చేతుల్తో కణతల్ని నొక్కుకుంటూ గంగాధర్నే చూస్తోందామె. సన్నగా ధ్వనిస్తూన్న ఆమె ఏడుపుని గంగాధర్ నవ్వు మింగేసింది.

"గంట నుంచీ చెప్తూనే వున్నాను! కానీ నీ శ్రేయోభి

లాషి టెంపో నమ్మలేదు. నువ్వు కూడా! క్యాసెట్ కోసం దేశదేశాలూ వెతికించీ, ఈ డిటెక్టివ్ ని నియమించీ అనవసరంగా డబ్బు తగలేశావ్! ఆల్ రైట్. జరిగిందేదో జరిగింది. ఇంతా జరిగాక, నన్ను నువ్వు అనుమానించాక, మనిద్దరం ఒకే కప్పుకింద వుండటం జరగదనుకుంటున్నా. ఇప్పుడే వెళ్ళిపోతున్నా. నీ కెరీర్ కి దెబ్బ తగులుతుందనుకుంటే అవసరమైనంత కాలం నిన్ను నా భార్యగా చెప్పుకోడానికి అనుమతి యిస్తున్నా! గుడ్ బై!" గంగాధర్ చూపుల్ని టెంపో వైపు తిప్పాడు.

గంగాధర్ మాటలు టెంపోకి నవ్వు తెప్పించాయి. శశిప్రియకు ఆగ్రహం తెప్పించాయని ఆగిపోయిన ఆమె ఏడుపు చెప్తోంది.

"కమాన్! కదులు!" గంగాధర్ రివాల్వరు ఊగిస్తూ ఉత్తరువిచ్చాడు.

టెంపో కొద్దిగా కదిలాడు. అతని కళ్ళు మెరిశాయి. ఆ మెరుపు గంగాధర్ చూశాడా? టెంపో చిరునవ్వుని పెదవులకి పూసుకున్నాడు.

"గంగాధర్, ఒక అపరాధం చేశావు. రెండో అపరాధం చేయొద్దు. రివాల్వరు దాచేయి. బ్లూ ఫిలిం కేసుతో కన్ను లొట్టపోయినా నీకు చావు తప్పుతుంది...."

"షటప్! కదులు క్యాసెట్ ని మంచమ్మీదికి వదులు!" గంగాధర్ హుంకరించాడు. అతని చూపులు తన కదలికలమీదే వున్నాయని టెంపో సంతృప్తితో గమనించాడు. శశిప్రియ చూపుల్తో అతని దృష్టిని మళ్ళిస్తుందా?

విగ్రహంలా నుంచున్న గంగాధర్ కి, తన వెనుక గాలి కదులుతున్నట్టు అనిపించింది. మెల్లిగా తల తిప్ప బోయాడతను.

రివాల్వరు బారెల్ గడ్డపారలా గంగాధర్ కుడిచేతి మీద వాలింది. అతని చేతిలోని రివాల్వరు కిందపడి చప్పుడు చేసింది. అప్రయత్నంగా అతను పెట్టిన చిన్న కేక ఆ చప్పుడులో కలిసిపోయింది. మెరుపులా అతను పక్కకి తిరిగాడు.

రివాల్వర్ గొట్టం అతని పొట్టలోకి గూటంలా గుచ్చిన ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్, గంగాధర్ ముఖంలోకి తీక్షణంగా చూశాడు.

"గంగాధర్, కవ్ చివ్ గా నించో!"

ఆశ్చర్యంతో గంగాధర్ కళ్ళు యింకా ఎర్రగా అయ్యాయి.

పకపకా నవ్వుతూ డిటెక్టివ్ టెంపో ఇన్స్పెక్టర్ దగ్గరగా నడిచాడు. "థాంక్స్ పృథ్వీ! ఆలస్యంగా వచ్చినా, క్లైమాక్స్ సీన్ కి అందుకున్నావ్!"

"మెట్లన్నీ ఎక్కేక బూట్లు తీసేశాను: ఎందుకేనా మంచిదని! అందుకే కాస్త ఆలస్యం అయింది...." పృథ్వీరావ్ నవ్వుతూ వివరించాడు.

"ఉత్తి చేతుల్తో వచ్చావా?" టెంపో నవ్వుతూ అడిగాడు.

పృథ్వీరావ్ నవ్వుతూ ఎడంవైపు బెల్టుకి వేళ్ళాడుతున్న బేడీల్ని తీశాడు. రివాల్వరు దెబ్బతో వాపెక్కుతున్న గంగాధర్ చేతికి తగిలించాడు. వెర్రివాడిలా ఒకసారి బేడీల్ని చూసుకుని గంగాధర్ తల పైకెత్తాడు. నిప్పులు కక్కుతూ టెంపోని చూశాడు. పళ్ళు కొరుక్కు

టెంపో! తిరిగొస్తాను!
ను కర్కశంగా.
నవ్వి యేదో చెప్ప
కన్ని ఆపింది. శశిప్రియ
ను నిలబడింది. ఆమె
లేవు. ఆగ్రహం ఆమె

కదిలింది. గంగాధర్
చప్పుడు గదిలో ప్రతి
ంసూరుగా పక్కకి కదిలి

నా ప్రేమను రుచి
యూస్తావ్! తిరిగొస్తావా?
నీకా మగతనం వుందా?
కాదు—నీ జీవితంలో
కాకుండా చేస్తాను! నీ
ప్లీస్ టేక్ దిస్ డర్టీ
)ంది.

', ఆ రివాల్వర్ నీ అధీ
కా కొన్ని ఎవిడెన్స్లు
'లూ దగ్గరా!" డిటెక్టివ్

స్టేట్ మెంటూ కూడా
అంది.

టెంపో నవ్వుతూ గంగాధర్ మొహంలోకి చూశాడు. అతని ఎడమ చెంప బూరెలా పొంగింది. ఆ పొంగులోంచీ రక్తం కాలువలా కారుతోంది. ఉంగరం ధరించిన శశిప్రియ చెయ్యి గంగాధర్ చెంపని వజ్రంలా కోసినట్టుంది ...శశిప్రియ ధర్ రక్తం కళ్ళజూసింది....

"లెట్స్ గో!" పృథ్వీరావ్ హెచ్చరించాడు.

9

"టెంపో, అన్నవిధంగా రాత్రిలోగా అసలు వ్యక్తిని పట్టగలుగుతావని నేను అనుకోలేదు! పైగా నువ్వు అనుమానం వ్యక్తంచేసిన వ్యక్తుల్లో కాకుండా మరో వ్యక్తిని, ఎవ్వరూ అనుమానించలేని గంగాధర్‌ని ఎలా సందేహించావో, ఎందుకు సందేహించావో అర్థం కావడంలేదు!" ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ అన్నాడు.

"నేను కూడా గంగాధర్ని అనుమానించలేక పోయాను...." టెంపోకీ, పృథ్వీరావ్‌కీ యెదురుగా సోఫాలో కూచున్న శశిప్రియ మెల్లిగా అంది.

టెంపో సిగరెట్ ముట్టించి ఆమెని నవ్వుతూ చూశాడు. "గంగాధర్ ప్రేమగురించినీ చిత్రీకరణ చివరి దాకా నన్ను తప్పుదారిలోనే నడిపించింది. నువ్వతన్ని అనుమానించలేక పోవడానికి కారణం నీ ప్రేమ. నేను వెంటనే అనుమానించలేకపోవడానికీ కారణం నీ ప్రేమే! ప్రేమ గుడ్డిది!"

"నిజమే గాడిదను గుర్రమనుకుని గుడ్డిగా ప్రేమించాను...." శశిప్రియ కంఠంలో పశ్చాత్తాపం పలికింది.

"ఎవరేనా, ఎవరి బ్లూఫిలిమేనా తయారుచేస్తే దానికి కారణం ఒక్కటే: స్వలాభం. నీ క్యాసెట్లు ఒకటికన్నా యెక్కువ లేవు కాబట్టి అమ్మి డబ్బు

సంపాయించే ఉద్దేశం 'అసలు వ్యక్తి'కి లేదని తేలిపోయింది. అమ్మి డబ్బు చేసుకోనప్పుడు ఇక మిగిలింది ఒక్కటే. బ్లాక్ మెయిల్. బ్లాక్ మెయిలర్ కూడా లేడు! అయితే యే ఉద్దేశాన్ని ఆశించి, బ్లూ ఫిలిం తయారు చేయబడింది? మరో ఉద్దేశం లేకుండా యెవరేనా తమ ప్రణయాన్ని ఒక క్యాసెట్‌గా తీసుకుంటే దానికి కారణం ఒక్కటే. ఏకాంతంలో తమ శృంగార లీలల్ని చూసి ఆనందించే చిత్రమైన కోరిక! ఇక్కడ అదీ లేదు. పార్టీస్‌లో ఒక్కచోటే అది ప్రదర్శించబడింది!" టెంపో ఆగి పృథ్వీరావ్ వైపు నవ్వుతూ చూశాడు.

"చక్కటి విశ్లేషణ! సాగించు!" ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ అన్నాడు శశిప్రియా ఆమె దగ్గరగా, సోఫా వెనక నిలబడ్డ శేఖర్ ఏకాగ్రతతో వింటున్నారు.

"రెండోసారి శేఖర్ని కలుసుకున్నప్పుడు నాకు తెలిసిన కొన్ని విషయాలు నా ఆలోచనల్ని మరో దారికి మళ్ళించాయి. భార్య బూతు చిత్రం చూసి షాక్ తిన్న గంగాధర్ విచారంలో మునిగిపోకుండా ఆమె ఇంట్లోనే ఇతర స్త్రీలతో తన కామాగ్నిని నిర్భయంగా, నిస్సంకోచంగా చల్లార్చుకుంటున్నాడు. కోలాలాంటి వొళ్ళమ్ముకుని జీవించే ఆడవాళ్ళతో శారీరక సంబంధం వుంచుకున్న గంగాధర్ బ్లూ ఫిలింలో కనిపించిన భార్యతో శారీరక సంబంధాన్ని యెందుకు తెంచేసుకున్నాడు? బ్లూ ఫిలిం భార్య, ఆ ఆడవాళ్ళకంటే అధికంగా చెడిపోయిందేమిటి?"

"తరవాత, ఆర్ట్‌ఫిల్మ్‌తో మూతికాలి అజ్ఞాతవాసంలోకి వెళ్ళిపోయి భార్య డైరీ చూసే గంగాధర్ సొంతంగా సినిమా తీయాలని సంకల్పించడం నాకు అస

వాటంగా అనిపించింది. శశిప్రియ ఉక్కిరిబిక్కిరయ్యేలా కాల్ షీట్స్ అరేంజ్ చేయడంలో వీలయినంత త్వరలో, వీలయినంత అత్యధికధనం పోగేసుకోడం తప్ప మరో ఉద్దేశం నాకు కనబడలేదు! తనని దర్శకుడిగా నియమించని నిర్మాతలందరిమీదా, ముఖ్యంగా తను నటిస్తున్న చిత్రాల్లో డైరెక్షన్ ఇప్పించని శశిప్రియమీదా అతనిలో కసి పెరిగిందని నా అనుమానం...." టెంపో ఆగి శశిప్రియవైపు నవ్వుతూ చూశాడు.

"నిజమే కావచ్చు! నా చిత్రాల్లో డైరెక్షన్ ఛాన్స్ ఇప్పించమని నన్ను చాలాసార్లు అడిగాడు. చివరికి నేను యాక్టు చేయడానికి దాన్నొక కండిషన్‌గా వుంచమన్నాడు కూడా! నేను అంగీకరించలేదు. భర్త వేరు. డైరెక్టర్ వేరు అనుకున్నాను. అతను పగబట్టాడని పసిగట్టలేకపోయాను!" శశిప్రియ అంది.

"ఆ కసిని సొంత చిత్రంతీసి, తీర్చుకోవాలన్న కోరికా, శశిప్రియను గిల్టీ కాన్షస్‌లో, డిఫెన్సివ్‌లో పడేసి ఆమె సంపాదనని సొంతం చేసుకుని పైకి చేరుకోవాలన్న ఆశా అతన్ని తెలివైన బ్లాక్ మెయిలర్‌గా చేశాయి! ఇన్ని దురాలోచనలున్న వ్యక్తి శశిప్రియని అంతగా ఎలా ప్రేమించాడన్న సందేహం నన్ను పీడించింది. ప్రత్యగాత్మారామ్ ఇంట్లో నేను కలుసుకున్న ప్రొడ్యూసర్లూ, హీరో ఇంద్రమోహన్ నాకు గంగాధర్ నిజస్వరూపాన్ని వివరించారు. 'అయ్యోపాపం' అన్న వాళ్ళచేత అందలం మోయించి, గమ్యం చేరుకునే అలవాటు గంగాధర్‌కి పుట్టుకతో వచ్చింది. పైగా ముఖ్యంగా పూర్వాశ్రమంలో అతనికి పెళ్ళయింది!" టెంపో ఆగి శశిప్రియవైపు చూశాడు.

తెరుచుకుంది. "మిస్టర్
ంతాన్ని అడ్డుకుంది.
క్టర్ పృథ్వీరావ్ అత
ుది ఒకటి! పూర్వాశ్రమ
' చేయడం ప్రారంభిం
సినిమా తియ్యకపోతే,
స్తానని ఆమె నిశ్చరంగా
ఓలేక అతను తెలివిగా
క్ మెయిల్ కాని బ్లాక్
గా, పాత పెళ్లాం తీటా
టెం పో నవ్వుతూ

డిటెక్టివ్ టెంపోని

వాత పడిపోకుండా,
పోకుండా నన్ను కాపా
ావాలో అరంకావడం
త్వరలో అతన్నుంచీ
ఇన్మ ఎత్తుతాను!"
పో చిరునవ్వుతో

గా చూపింది. ఆమె
ఆమె వెనక నించున్న
ఆమె భుజంమీదికి

నా భార్య అవుతుంది.
ఉద్రేకంతో వణికింది,

శశిప్రియ తటాలున తల పైకెత్తి అతని మొహంలోకి చూసింది. ఆమె కళ్ళ చివర్లలోంచి జారుతున్న ఆనంద బాష్పాల్ని డిటెక్టివ్ టెంపో, ఇన్ స్పెక్టర్ పృథ్వీరావ్ చిరునవ్వుతో చూశారు.

"వెరీగుడ్, శేఖర్! అలా అయితే వెనకనుంచోడం దేనికి? సోఫాలో శశిపక్కనే కూచో. పృథ్వీరావూ, నేనూ ఆశీర్వదిస్తాం!" డిటెక్టివ్ టెంపో నవ్వుతూ అన్నాడు.

అప్రయత్నంగా శేఖర్ కదిలాడు. శశిప్రియ తల వాల్చి కదిలిపోతూ టెంపోని చూసింది. మరుక్షణం ఆపుకోలేక హాయిగా నవ్వేసింది. ఆమె మొహం మేఘాల నీలనీడలు తొలగిన చందమామలా వుంది.

"చూశావా, నాలా హాయిగా నవ్వుతున్నావ్!" టెంపో నవ్వుతూ అన్నాడు.

—: అ యి పో యి ం ది :—